# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

గురువారం 16 ఫిబ్రవరి 2023


## మన్నూరు చెరువులో పడి హైస్కూల్ విద్యార్థి దుర్మరణం

రాజంపేట అర్బన్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త



చెరువులో విద్యార్థిని వెలికి తీస్తుండగా చూసేందుకు వచ్చిన గ్రామస్థులు, ప్రభుత్వాసుపత్రిలో మృతి చెందిన విద్యార్థి చరణ్‌తేజ

కాలకృత్యాలు తీర్చుకొనేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి దుర్మరణం చెందిన విద్యార్థి ఉదంతం ఇది. మండలంలోని చెర్లోపల్లె గ్రామానికి చెందిన చరణ్‌తేజ బోయనపల్లె హైస్కూల్లో చదువుతున్నాడు. మధ్యాహ్నం మరో స్నేహితునితో కలిసి చెరువులోకి కాలకృత్యాలు తీర్చుకొనేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు చెరువులోకి వెళ్లి బయటకు రాలేకపోవ డంతో సహవిద్యార్థి కేకలు వేశాడు. చుట్టుపక్కలవారు వచ్చి చరణ్‌తేజను చెరువులో నుంచి బయటకు తీసు కువచ్చారు. వెంటనే తాగిన నీటిని బయటకు వచ్చేలా ప్రాథమిక చికిత్స చేశారు. అయినా కూడా పూర్తిగా శ్వాస కనిపించకపోవడంతో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స చేస్తుండగానే సాయంత్రం చరణ్‌తేజ మరణించాడు. దీంతో గ్రామంలో విషాదం నెలకొంది. మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా ప్రారంభమయిన శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు

రాయచోటి టౌన్.ఫిబ్రవరి15 ప్రభాతవార్త



అన్నమయ్య జిల్లా రాయచోటిలో వెలసిన శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామివారి బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయ చైర్మన్ పోలంరెడ్డి విజయమ్మ ఆలయ పర్యవేక్షణ అధికారి రమణారెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ దశరధరామిరెడ్డి ఆద్వర్యంలో యాగశాల ప్రవేశం గణపతి పూజ కంకణ దీక్షలు శ్రీ భద్రకాళీ సమతే వీరభద్రస్వామి పరివార దేవతల పూజలు తదుపరి ద్వజారోహణంతో ప్రారంభయిన బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ద్వజారోహణలో భాగంగా వీర శైవ భక్తులు వేగ పండితులు నందుల మఠం శశిభూషణ సిద్దాంతి వారి శిష్యగణం మంత్రోచ్చరణలు రకరకాల విన్యాసాలతో నృత్య ప్రదర్శన నిర్వహించారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలును తిలకించేందుకు పెద్ద సంఖ్యలో హాజరయిన కన్నడ తెలుగు రాష్ట్రాల భక్తులు వచ్చిన భక్తులుకు తీర్దప్రసాదాలు అందజేశారు.

# వైఎస్ఆర్ జిల్లా ప్రజల కలల స్వప్నం సాకారం

### కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి భూమి పూజ చేసిన ముఖ్యమంత్రి

### పారిశ్రామిక విప్లవానికి అంకురార్పణతో వేలాది మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు







జమ్మలమడుగు, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :

సీమవాసుల చిరకాల స్వప్నాన్ని నెరవేరుస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వైఎస్ఆర్ జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. జేఎస్ డబ్ల్యూ (గ్రూప్స్) ఆధ్వర్యంలో వైఎస్సార్ జిల్లా, జమ్మలమడుగు నియోజకవర్గం సున్నపురాళ్లపల్లెలో.. 3500 ఎకరాల్లో రూ. 8,800 కోట్లతో 30 లక్షల టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్న స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, జేఎస్ డబ్ల్యూ (గ్రూప్స్) చైర్మన్ సజ్జన్ జిందాల్, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా, జిల్లా ఇంఛార్జ్ మంత్రి ఆదిమూలపు సురేష్‌లతో కలిసి బుధవారం భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ముఖ్య అతిధులు ప్రసంగించారు. ఈ సందర్భంగా జేఎస్ డబ్ల్యూ (గ్రూప్స్) చైర్మన్ సజ్జన్ జిందాల్ మాట్లాడుతూ దేశంలోనే అతివేగంగా అభివృద్ధి పథంలోకి అడుగులు వేస్తున్న ఆంధ్రప్రదేశ్‌లో ఉక్కు పరిశ్రమతో పాటు మరిన్ని పారిశ్రామిక ఉత్పత్తి రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఉత్సాహంగా ఉన్నామన్నారు. ప్రస్తుతం సున్నపురాళ్లపల్లెలో చేపడుతున్న ఈ కర్మాగార నిర్మాణం ప్రారంభించిన 36 నెలల్లోనే తొలి దశగా ఉత్పత్తిని అందుబాటులోకి తీసుకువచ్చే లక్ష్యంతో అడుగులేస్తున్నామన్నారు. డైనమిక్ నాయకుడిగా ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిగా వర్ధిల్లుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సారథ్యంలో.. రాష్ట్రం పారిశ్రామిక వెలుగులతో దేదీప్యమానంగా వెలుగొందుతుందని ఆకాంక్షించారు. దివంగత ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖర్ రెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ తండ్రికి మించిన తనయుడిగా.. ప్రజా శ్రేయస్సు కోసం పాటుపడుతున్న జగన్ మోహన్ రెడ్డితో మైత్రిని కలకాలం కొనసాగిస్తామని ఆయన అభిలషించారు. పారిశ్రామికంగా పెట్టుబడులు పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్ని విధాలా అనుకూలంగా ఉందని ముఖ్యంగా జమ్మలమడుగు ప్రాంతంలో అన్ని రకాల వనరులు సమృద్ధిగా ఉన్నాయన్నారు. గ్రీన్ ఎనర్జీ రంగంలో కూడా తమ జేఎస్ డబ్ల్యూ సంస్థ గ్రీన్ ఎనర్జీ రంగంలోనూ పెట్టుబడులు పెట్టేందుకు మొగ్గు చూపుతోందని.. అందులో భాగంగా 2.5 మెట్రిక్ టన్నుల డీఆర్ఎస్ఐ ప్లాంట్, 1000 మెగావాట్ల ఎలక్ట్రోలైజర్ ప్లాంట్, 3,000 మెగావాట్ల సోలార్, విండ్ పంప్డ్ హైడ్రోస్టోరేజ్ వంటి ప్రత్యామ్నాయ ఇంధన ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సన్నద్ధం అవుతోందన్నారు. అంతేకాకుండా బ్యాటరీ స్టోరేజ్, హైడ్రోజన్ స్టోరేజ్ కేంద్రాలను కూడా ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి గుడివాడ అమర్నాథ్‌రెడ్డి మాట్లాడుతూ పరిశ్రమలే ఆర్థిక ప్రగతికి ఆయువు పట్టు అని విశ్వసించిన ముఖ్యమంత్రి జిల్లాలో వేలాది ఎకరాల్లో పారిశ్రామిక వాడలను ఏర్పాటు చేయడం వైఎస్ఆర్ జిల్లా ప్రజల అదృష్టం అన్నారు. కొత్త యూనిట్ల స్థాపనతో ఏపి ఐఐసి ద్వారా.. రాష్ట్రంలోని పలు ప్రాంతాలను పారిశ్రామిక వాడలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సహించడంతో పాటు దేశ విదేశాల నుండి పెట్టుబడులను ఆకర్షించేలా.. కొప్పర్తి ఇండస్ట్రియల్ పార్కులో దాదాపు 550 ఎకరాల విస్తీర్ణంలో వైఎస్ఆర్ మెగా ఇండస్ట్రియల్ క్లస్టర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందివ్వడం ద్వారా వేలాది మంది యువతకు మెండైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు అందనున్నాయన్నారు. అంతేకాకుండా.. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ఆయా రంగాల్లో మెరుగైన శిక్షణ అందివ్వడం జరుగుతోందన్నారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న వనరులతో నూతన వస్తు ఉత్పత్తులను అభివృద్ధి చేసేలా అవగాహన పెంచడం జరుగుతోందని పరిశ్రమల స్థాపనతో అటు రాష్ట్ర ప్రగతి ఇటు జిల్లా కీర్తి ప్రపంచ స్థాయిలో వెలుగొందనుందన్నారు. కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించాక.. 2019లో ఏపీ హైగ్రేడ్ స్టీల్స్ పేరుతో ముఖ్యమంత్రి స్టీల్ ప్లాంటుకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. అనంతరం కోవిడ్ సంక్షోభం కారణంగా పలు సంస్థలు పెట్టుబడి ప్రతిపాదనలను కూడా ఉపసంహరించుకోవడంతో రెండేళ్లు ఎలాంటి నిర్మాణ పనులు జరగలేదన్నారు. అయితే రాయలసీమ ప్రజల చిరకాల స్వప్నానికి కార్యరూపం ఇచ్చే దిశగా ముఖ్యమంత్రి అడుగులు వేశారన్నారు. ప్రస్తుతం దేశంలో రూ.1,76,000 కోట్ల (22 బిలియన్ డాలర్లు) మార్కెట్ విలువ కలిగి, ఏటా 27 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి చేస్తున్న జేఎస్ డబ్ల్యూ కంపెనీ జమ్మలమడుగు నియోజకవర్గంలోని సున్నపురాళ్ల పల్లెలో ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం అభినందనీయం అన్నారు. జిందాల్ గ్రూపు సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం దీర్ఘకాలిక లీజు ప్రాతిపదికన భూములను కేటాయించడంతో తొలి విడతలోనే ఆ సంస్థ రూ.3,300 కోట్లతో ఏటా 10 లక్షల టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యంతో రూపుదిద్దుకోనుందన్నారు. రెండో విడతలో మరో 20 లక్షల టన్నులు ఉత్పత్తి చేసే లక్ష్యంతో మొత్తం 30 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో పరిశ్రమ నిర్వహణలోకి రానుందన్నారు. వైఎస్సార్ జిల్లా.. రాష్ట్రానికే తలమానికంగా పారిశ్రామిక రంగంలో ప్రగతి పథంలో అడుగులేస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. ఇప్పటికే మొదలైన పారిశ్రామిక విప్లవంతో.. దేశీయ పారిశ్రామిక వేత్తలనే కాకుండా.. విదేశీ కంపెనీలు, పెట్టుబడిదారులను సైతం జిల్లా ఆకట్టుకుంటోందని.. తాజాగా ఉక్కు పరిశ్రమకు ముఖ్యమంత్రి భూమిపూజ చేయడం, త్వరలో పనులు ప్రారంభం కానుండడం. నూతన పరిశ్రమల నాందికి ప్రభుత్వం శ్రీకారం చుట్టడంతో జిల్లాలో పారిశ్రామిక విప్లవం మొదలైందన్నారు. పులివెందుల, గోపవరం, సీకే దిన్నె మండలాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా.. ఏపీ ఐఐసి ఆధ్వర్యంలో వేలాది ఎకరాల్లో పలు భారీ పరిశ్రమలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో త్వరలోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందనున్నాయన్నారు. ఈ కార్యక్రమానికి జెడ్పి చైర్మన్ ఆకెపాటి అమర్నాథ్ రెడ్డి, ఎపిఎస్ ఆర్టీసీ ఛైర్మెన్ మల్లికార్జున రెడ్డి, కడప నగర మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ లు రమేష్ యాదవ్, గోవింద రెడ్డి, మాజీ మంత్రి రామసుబ్బారెడ్డి, హజ్ కమిటీ చైర్మన్ గౌస్ లాజమ్, జిందాల్ (గ్రూప్స్) జీఎం పి.కె.మురుగన్, జిందాల్ (గ్రూప్స్) యాజమాన్య సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### వాలంటీర్‌లే హీరోలు...

## ప్రజా ప్రతినిధులు జీరోలు...!!

రాయచోటి.ఫిబ్రవరి15 ప్రభాతవార్త



గ్రామీణ ప్రజా ప్రతినిధులు విధులు నిర్వీర్యం చేస్తూ అమరావతి సచివాలయం నుంచి వచ్చే ఆదేశాలు క్షేత్ర స్థాయిలో అమలు చేసేది గ్రామ వార్డు సచివాలయాలు వాలంటీర్లు గ్రామంలో ప్రజా ప్రతినిధులు ఎన్నికైన సర్పంచ్‌లు జడ్పిటిసిలు, పాత్ర నామమాత్రమే ప్రజాభిమానంతో లక్షలాది రూపాయాలు వెచ్చించి ఎన్నికైన తమ పరిస్థితి ఏమిటని గ్రామీణ ప్రజా ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. ప్రజలుకు ఏమి చేయలేని తమను రాబోయే ఎన్నికలల్లో ఎలా ఆదరిస్తారు. తమ రాజకీయ భవిష్యత్తు ఎమిటి అనేది వారి వేదన ప్రజా సమస్యలు నుంచి పాలనకు సంబందించిన విషయాలు తెలుసుకోవాలంటే వాలంటీర్ సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వం సంబందించిన పలు సంక్షేమ పథకాలు తమ దృష్టికి రాలేదని ఇటీవల పెన్షన్‌కు సంబందించిన వివరాలు ఏవి తమ దృష్టికి రాలేదని ఎవరిని అర్హులుగా ప్రకటిస్తున్నారో ఎవరిని అనర్హులుగా ప్రకటిస్తున్నారో కనీసం సమాచారం కూడా తకు తెలియదని జెడ్పిటిసిలు గ్రామ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు ప్రజా ప్రతినిధులు వాపోతున్నారు. తమను నమ్మే ఆదరించి ఓట్లు వేసి గెలపించిన ప్రజలకు తామేమి సమాధానం చెప్పాలన్నదే వారి ప్రశ్న రాజ్యాంగబద్దంగా ఏర్పడిన పంచాయతీరాజ్ వ్యవస్థలో భాగమైన జిల్లా పరిషత్ ప్రాధేశిక నియోజకవర్గం సభ్యులు జెడ్పిటిసిలు మండల పరిషత్ ప్రాదేశిక నియోజక వర్గం సభ్యులు ఎంపిటిసిలు గ్రామ సర్పంచ్‌లు నిధులు, విధులు కోసం ఎంతో కాలంగా పోరాడుతున్నారు. మండల పరిషత్ కారాలయంలో తమ కుర్చీ కోసం కొంతకాలంట పోరాటం సాగించారు. అధికార వికేంద్రీకరణలో భాగంగా పంచాయతీలకు స్వయం ప్రతిపత్తి కలిగించాలని పోరాటం నేటిది కాదు గ్రామ స్థాయి అధికార వికేంద్రీకరణ అయితే ఈ ప్రభుత్వ హయాంలో జరిగింది కానీ పంచాతీల స్థానే సచివాలయ ఏర్పాటు వల్ల పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యం అయింది. పంచాయతీలో జరిగే గ్రామ సభలు లబ్ధిదారుల ఎంపిక గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు అన్ని ప్రజా ప్రతినిధులు సమక్షంలో తీర్మానాలు జరిగేవి వార్డు సభ్యులు, సర్పంచ్‌లు సమావేశంలో తీర్మానం చేసి అమలు జరిపేవారు. అలా చేయడం వల్ల గ్రామాల్లో వారికి తగిన ఆదరణ ప్రాధాన్యత దక్కేది కానీ ప్రస్తుతం ఎందుకు విరుద్ధంగా జరుగుతుంది. సచివాలయం కీలకపాత్రగా మారింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ సచివాలయంలోని అధికారులు కార్యాచరణ మేరకు వాలంటీర్లు క్షేత్రస్థాయిలో అమలు జరుపుతుండటంతో వాలంటరీ లబ్ధిదారులు ప్రధమ ప్రాధాన్యాత ఇస్తున్నారు. అయితే ఈ నేపద్యంలో ప్రజా సేవ చేయాలనే ఆలోచన కలిగిన వారు రాజకీయంగా ఎదగాలనే ఆసక్తి గల వారు గ్రామస్థాయిలో పోటీ చేసి పదవుల్లోకి వచ్చిన వారికి ఈ సచివాలయ వాలంటరీ వ్యవస్థ నోట్లో పడ్డ ఎలక్కాయలాగా మారింది. ఈ ప్రభావం రాబోయే శాసనసభ ఎన్నికల్లో ఖచ్చితంగా పడబోతుంది. ప్రభుత్వం అధికా వికేంద్రీకరణలో భాగంగా ప్రవేశబెట్టిన వాలంటరీ వ్యవస్థ నుంచి ఫలితాలను ఇస్తున్నప్పటికి ప్రజా ప్రతినిధులు ప్రాధాన్యత క్రమేపి తగ్గుతుంది. ముఖ్యంగా గ్రామ వార్డు స్థాయిలో ప్రజా ప్రతినిధులు పాత్ర నామ్‌కే వాస్తేగా మారుతుంది. రాజ్యాంగబద్దంగా ఏర్పడ్డ ఈ వ్యవస్థను ప్రభుత్వం నీరు గారుస్తున్నదని ఆరోపణలు ప్రజా ప్రతినిధులు నుంచి వెల్లువెత్తుతున్నాయి. గ్రామ పంచాయతీకి రావాల్సిన నిధులను సైతం పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపణలు లేకపోలేదు.

## విద్యార్థుల పురోగతిలో తల్లిదండ్రులది కీలక బాధ్యత

### అన్నమయ్య జిల్లా డిఈవో రాఘవరెడ్డి

రాయచోటి.ఫిబ్రవరి15 ప్రభాతవార్త




ప్రభుత్వోన్నత పాఠశాల, నేతాజి సర్కిల్, రాయచోటి నందు ప్రధానోపాధ్యాయులు కొండూరు శ్రీనివాసరాజు అధ్యక్షతన పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన జిల్లా డీఈవో రాఘవరెడ్డి మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు తొందర్లోనే ఉన్నందున విద్యార్థులను ఇంటి దగ్గర కనీసం నాలుగు గంటల పాటు చదివించడానికి ప్రతి తల్లి దండ్రి కృషి చేయాలని సూచించారు. ఇంటిలో పెంచుకునే మొక్కలు ఎదుగుదల కోసం ఎంతో ప్రయత్నించే మనం మన బిడ్డల విద్యాప్రమాణాల పెంపుకు కనీసం ప్రయత్నం చేయాలని పిలుపునిచ్చారు. మీరు విద్యావంతులు కాకపోయినప్పటికి మీ పపిల్లలను ముందు కూర్చోబెట్టుకుని చదివే విధంగా ప్రోత్సహించాలి. ప్రత్యేకించి ఈ పాఠశాలలో ఉన్న ఎన్‌సిసి సౌలభ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొండూరు శ్రీనివాసరాజు మాట్లాడుతూ పాఠశాలకు విధిగా సరైన సమయానికి విద్యార్థులను పంపాలని, వారానికొకసారి పాఠశాలకు వచ్చి వారి పిల్లల హాజరు,మార్కులను తల్లిదండ్రులు పరిశీలించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులు చదువుకోవడానికి, మెరుగైన ఫలితాలు పొందడానికి అనేక రకాల వసతులను కల్పిస్తోందన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్ మాట్లాడుతూ విద్యార్థులను గాడిలో పెట్టే గురుతర బాధ్యత ఉపాధ్యాయులదేనని తల్లిదండ్రులు సహృదయంతో ఉపాధ్యాయులుకు సహకరించాలని సూచించారు. ఈ సందర్భంగా పదో తరగతి పరీక్షలు రాబోయే విద్యార్థులకు ఆశీస్సులు అందించారు. రాయచోటి ప్రాంతానికి చెందిన వైసిపి నాయకుడు కోడి శ్రీనివాసులు రెడ్డి సుమారు రూ.25వేలు విలువచేసే మైక్ సెట్‌ను విరాళంగా అందించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరాజు, మున్సిపల్ చైర్మన్, ఫయాజుర్ రెహమాన్ లను పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు.

## భక్తి శ్రద్ధలతో మాడ వీధులలో ఊరేగిన జీవదారు ధ్వజస్తంభం

బ్రహ్మంగారి మఠం, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :

జగద్గురు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం నందు జీవదారు ధ్వజ స్తంభ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా రెండవ రోజు మఠం బుధవారం బ్రహ్మంగారి మఠం మాడ వీధులలో భక్తులు మరియు గ్రామస్తులతో వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. పూర్వపు మఠాధిపతి శ్రీ వీరబోగ వసంత వెంకటేశ్వర స్వామి పెద్ద కుమారుడు నొస్సం శ్రీ వెంకటాద్రి స్వామి వారి సహోదరుల సమక్షంలో దేవాదాయ శాఖ ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ ఆదేశాల మేరకు మఠం మేనేజర్ ఈశ్వరయ్యాచారి పర్యవేక్షణలో సంప్రదాయ పద్ధతులు పాటిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించి జై వీరమాంబ జై గోవిందమాంబ జై అంటూ నినాదాలు చేస్తూ మాడ వీధుల గుండా జీవదారు ధ్వజ స్తంభం యొక్క ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పూర్వ ధ్వజ స్తంభమును తంబళ్ళపల్లె వాస్తవ్యులు దాతలుగా వారి పూర్వీకులు గత 100 సంవత్సరాలు పైబడి కూడా జీవదారు ధ్వజ స్తంభమును అప్పట్లో అందించడం జరిగినది. వారి సంతతికి చెందిన వారే నూతన జీవదారు ధ్వజ స్తంభమును అమలాపురం నుండి తీసుకువచ్చి బ్రహ్మంగారి మఠం యాజమాన్యానికి అప్పగించడం జరిగినది. గురువారం ధ్వజ స్తంభం ప్రతిష్ఠ నిర్వహిస్తున్నామని తంబళ్ళపల్లె వాస్తవ్యులు తెలిపారు.



జీవదారు ధ్వజ స్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం.

## అక్రమ నిర్మాణాలు, అనధికార లే అవుట్లపై చర్యలు

### - అనుడా వైస్ ఛైర్మెన్ నందన్, ఆర్డీవో వెంకటరమణ






మాట్లాడుతున్న అనుడా వైస్ ఛైర్మెన్ నందన్, ఆర్డీవో ఆకుల వెంకటరమణ, హాజరైన ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది.

బద్వేలు, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :

పంచాయతీ, మున్సిపాలిటీలలో అనుడా అనుమతి లేకుండా అక్రమంగా నిర్మాణాలు, అనధికారిక లే అవుట్లు చేపడితే తగు చర్యలు తీసుకోవడం జరుగుతందని అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ ఛైర్మెన్ నందన్, ఆర్డీవో ఆకుల వెంకటరమణ అన్నారు. బుధవారం అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోని బద్వేలు రెవిన్యూ డివిజన్‌కు సంబంధించి పంచాయతీ కార్యదర్శులతో పంచాయతీలలో ఆన్‌లైన్ బిల్డింగ్ ప్లాన్ అనుమత్రి ప్రక్రియ పై అవగాహన సదస్సును డివిజన్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీలలో 300 చదరపు మీటర్ల కంటే తక్కువ వైశాల్యం ఉన్న బిల్డింగ్ ప్లాన్ ప్రక్రియ అనుమతికి సంబంధించి ఎట్రో ల్యాప్స్ అభివృద్ధి చేయబడ్డ అప్లికేషన్ పై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. భవన నిర్మాణ ప్రక్రియలో ఆన్‌లైన్ విధానం తీసుకురావడంతో పారదర్శకత కలుగుతుందని, అనుమతి తీసుకునే ప్రక్రియ సులభతరం అవుతుందని తెలిపారు. పంచాయతీలలో అక్రమ నిర్మాణాలు, అనధికార లే అవుట్లపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇక నుంచి అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అనుమతి లేనిదే ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపివో కృష్ణ సింగ్, డిఎల్‌పివో రమణారెడ్డి, ఎంపీడీవోలు, ఈవోలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మరో ఉక్కు నగరంగా మారబోతున్న జమ్మలమడుగు

- 30లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో స్టీల్ ప్లాంట్ నిర్మాణం
- రూ.8800 కోట్లతో జిందాల్ గ్రూప్ పెట్టుబడి
- 30 నెలల్లో అందుబాటులోకి రానున్న మొదటి ప్లాంటు
- ప్రత్యక్షంగా, పరోక్షంగా 25వేల మందికి ఉపాధి
- భూమిపూజ చేసిన ముఖ్యమంత్రి జగన్, సజ్జన జిందాల్



జమ్మలమడుగు, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:

జమ్మలమడుగు మరో ఉక్కు నగరంగా మారబోతోంది. రానున్న 30 నెలల్లో ఉక్కు కర్మాగారం నిర్మాణం కానుంది. రూ.8800 కోట్ల పెట్టుబడితో, 30 లక్షల టన్నుల సామర్థ్యంతో సున్నపురాళ్లపల్లె కొండలపై అధునాతన ఉక్కు కర్మాగారం కొలువుదీరబోతోంది. తద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 25వేల మందికి ఉపాధి లభించనుంది. కర్మాగారంలో 75% ఉద్యోగాలు స్థానికులకే కల్పించనున్నట్లు సీఎం జగన్ ప్రకటించడంతో స్థానికుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అయ్యాయి.

**నిరాడంబరంగా భూమి పూజ కార్యక్రమం..** ఉక్కు కర్మాగార నిర్మాణానికి బుధవారం ఉదయం 11 గంటల సమయంలో రాష్ట్ర సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జేఎస్‌డబ్ల్యూఎస్ గ్రూప్ ఛైర్మన్ సజ్జన్ జిందాల్‌లు కలిసి సంయుక్తంగా భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమం అద్భుతం, నిరాడంబరంగా సాగింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ జిల్లాలో అమలులో ఉండడంతో కేవలం వెయ్యి మందితో మాత్రమే సభను నిర్వహించారు. మధ్యాహ్నం ఒంటి గంటకు సభను ముగించారు.

**నాన్న కలను నెరవేరుస్తున్నా : ముఖ్యమంత్రి వైఎస్.జగన్**

జమ్మలమడుగు ఉక్కు కర్మాగారం నిర్మితం కావాలన్న డా.వైఎస్.రాజశేఖర్‌రెడ్డి చిరకాల స్వప్నం నెరవేర్చబోతున్నందుకు సంతోషంగా ఉందని, కర్మాగార నిర్మాణానికి జిందాల్ గ్రూప్ ముందుకు రావడం హర్షణీయమని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. స్టీల్ ప్లాంట్ నిర్మాణం కొరకు మూడు వేల ఎకరాల భూములను దీర్ఘకాలిక లీజుకు ఇచ్చామని, మౌలిక వసతుల కోసం రూ.700 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయనుందని ఆయన తెలిపారు. ఒకసారి ఉక్కు కర్మాగారం నిర్మితమైతే దీని చుట్టుపక్కల ఎన్నో పరిశ్రమలు వస్తాయని తద్వారా రానున్న నాలుగైదు ఏళ్లలో లక్ష మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. జమ్మలమడుగు మరో ఉక్కు నగరంగా అభివృద్ధి చెందుతుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. తనపై నమ్మకం ఉంచి ఇక్కడ రూ.8800 కోట్ల పెట్టుబడులతో ముందుకు వచ్చిన సజ్జన్ జిందాల్‌కు సీఎం కృతజ్ఞతలు తెలిపారు.

**డా.వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నాకు మంచి మిత్రుడు సజ్జన్ జిందాల్**



దివంగత ముఖ్యమంత్రి డా.వైఎస్.రాజశేఖర్‌రెడ్డి తనకు మంచి మిత్రుడని జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్ సజ్జన్ జిందాల్ గుర్తు చేసుకున్నారు. 17 ఏళ్ల క్రితమే రాజశేఖర్‌రెడ్డి తన కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డిని తనకు పరిచయం చేశాడని, అప్పుడే ఆయన ఉక్కు పరిశ్రమను స్థాపించడంలోని సాదక బాధకాలను తనను అడిగి తెలుసుకున్నారని పాత జ్ఞాపకాలను జిందాల్ నెమరువేసుకున్నారు. ప్రస్తుతం జగన్ సీఎం కావడం, ఆయన సహకారంతో ఇక్కడ తాను ఉక్కు కర్మాగారాన్ని నిర్మించడం ఆనందదాయకంఆ ఉందన్నారు. రాయలసీమకు అతి దగ్గరలోని కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా విజయనగరంలో తాను పెద్ద ఉక్కు కర్మాగారాన్ని నిర్మించానని, అయితే జమ్మలమడుగులో నిర్మించబోతున్న ఉక్కు కర్మాగారం దేశంలోనే పేరుకు రానుందని ఆయన చెప్పారు.


**ముగ్గురు మంత్రులు.. ఎంపీ, ఎమ్మెల్యేలు హాజరు..**

ఉక్కు కర్మాగారం భూమి పూజ కార్యక్రమానికి ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆది మూలపు సురేష్, కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. వైఎస్ఆర్ స్టీల్‌ప్లాంట్ అథారిటీ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ శన్మోహన్ కార్యక్రమాన్ని ముందుండి నడిపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ అన్బురాజన్, ఆర్డీవో శ్రీనివాసులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారం పంపిణీలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు

### -ఐసిడిఎస్ ఇన్‌చార్జ్ పిడి ధనలక్ష్మీ

రాయచోటి.ఫిబ్రవరి15 ప్రభాతవార్త



జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భవతులు, బాలింతలకు పంపిణీ చేసే పౌష్టికాహారంలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఐసిడిఎస్ పిడి ఎం.ధనలక్ష్మీ బుదవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నమయ్య జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో 2275 అంగన్‌వాడీ కేంద్రలు ఉన్నాయన్నారు. ఈ కేంద్రాల పరిధిలోని చిన్నారులు, బాలింతలు, గర్భవతులుకు నాణ్యమైన పౌష్టికాహారంను అందజేయడం జరుగుతుందన్నారు. ప్రతి రోజు క్రమం తప్పకుండా మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందజేస్తున్నామని ఇందులో ఎటువంటి నాణ్యతాలోపం ఉన్నా వెంటనే తమకు తెలియజేయాలన్నారు. పౌష్టికాహారం నాణ్యతలో రాజీ పడే ప్రసక్తే లేదని ఎక్కడైనా నాణ్యత లోపం ఉంటే సంబందిత అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలను తరచూ విజిట్ చేయడం జరుగుతోందని ఇక్కడపని చేసే టీచర్‌లు, కార్యకర్తలు, సిబ్బంది సమయపాలన పాటించి విధులు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ఇక నుంచి పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలన్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలకు చర్యలు: ఆర్డీఓ

మదనపల్లె, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :



పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేసే పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆర్డీఓ ఎంఎస్.మురళి తెలిపారు. బుధవారం పట్టణంలోని మండలపరిషత్ కార్యాలయం, జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేయనున్న ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఆర్డీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరుజిల్లాకు సంబంధించిన మార్చి 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలను పరిశీలించడం జరిగిందన్నారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉందన్నారు. ఎన్నికల పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్‌లను చిత్తూరుకు తరలించడం జరుగుతుందన్నారు. ఆర్డీఓ వెంట తహశీల్దార్ సికె. శ్రీనివాసులు, ఎంపిడిఓ తాజ్‌మస్రూన్, సిబ్బంది పాల్గొన్నారు.

## లక్ష్యం మేరకు ఆస్తి పన్ను వసూళ్ళు

### మున్సిపల్ కమిషనర్ ప్రమీళ

మదనపల్లె, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త



ప్రభుత్వం లక్ష్యం మేరకు మున్సిపల్ ఆస్థి పన్ను వసూలు చేయడం జరుగుతుందని కమిషనర్ ప్రమీళ తెలిపారు. బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ పట్టణంలోని 35వార్డుల్లో 25,325 అసిసెమెంట్లు ఉన్నాయన్నారు. ఈ ఏడాదికి సంబంధించి ఆస్థిపన్ను రూ.19.85కోట్లు వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ. 10.54కోట్లు వసూలు చేశామన్నారు. ఇంకా రూ.9.31కోట్లు వసూలు చేయాల్సి ఉందన్నారు. మార్చి నెలాఖరులోపు లక్ష్యం మేరకు ఆస్థిపన్నులు వసూలు చేస్తామన్నారు. ఇప్పటికే రెవెన్యూ సిబ్బంది టీమ్‌లుగా ఏర్పడి బకాయిలున్న ఇళ్ళ వద్దకు వెళ్ళి పన్నులు వసూలు చేశామన్నారు. సచివాలయ ఉద్యోగుల ద్వారా కూడా పన్నుల వసూళ్ళకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడం జరిగిందన్నారు. పట్టణ ప్రజలు సకాలంలో ఆస్తిపన్ను చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలన్నారు.

## చిరుధాన్యాల పంటలను సాగు చేయాలి

### పొలంబడిలో ఏఓ నాగప్రసాద్

మదనపల్లె, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:



రైతులు చిరుధాన్యాల పంటలను సాగు చేయాలని వ్యవసాయ అధికారి నాగప్రసాద్ తెలిపారు. బుధవారం రూరల్ మండలంలోని కోటవారిపల్లె గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటల్లో కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యవంతమైన పంటలను పండించవచ్చునన్నారు. ఈ ఏడాదిని ప్రభుత్వం చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిందన్నారు. ప్రతి రైతు చిరుధాన్యాల విలువను గుర్తించి పండించాలన్నారు. పొలంబడి క్షేత్రంలో ఎకోలాజికల్ ఇంజనీరింగ్‌లో భాగంగా రాగులను విత్తారు. కార్యక్రమంలో ఏఈఓ యమల నవ్యజ్యోత్న, ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## తాండాలో సేవాలాల్ మహరాజ్ విగ్రహప్రతిష్ట

మదనపల్లె, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:



పట్టణ సమీపంలోని నక్కలదిన్నె తాండాలో బుధవారం సేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ట ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి అన్నమయ్యజిల్లా అధ్యక్షులు అమరేంద్రనాయక్, తాండా పెద్ద శీనునాయక్, కౌన్సిలర్ ఈశ్వర్ నాయక్ హాజరై మాట్లాడారు. విగ్రహదాత ఎంపి మిథున్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సేవాలాల్ మహరాజ్ 284వ జయంతిని పురస్కరించుకొని ఈ ప్రతిష్ట కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విగ్రహ ప్రతిష్టకు సహకరించిన ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఛైరెపర్సన్ మనూజారెడ్డి, కౌన్సిలర్ ఈశ్వర్ నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరి వేణుగోపాల్ నాయక్, నాయకులు వినోద్‌కుమార్ నాయక్, మనోహర్‌నాయక్, శ్రీకాంత్ నాయక్, తాండా పెద్దలు పాల్గొన్నారు.

## యువగళం యాత్రతో యువతలో ఉత్తేజం

మదనపల్లె, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ చేపడుతున్న యువగళం పాదయాత్రతో యువతలో ఉత్తేజం నెలకొన్నదని మదనపల్లె నియోజకవర్గ యువ నాయకులు ఎర్రబల్లి వెంకటరమణారెడ్డి తెలిపారు. లోకేష్ పాదయాత్రలో ఆయన మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, యువతతో కలసి పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. లోకేష్ పాదయాత్ర వల్ల యువత మరింత ఉత్తేజంగా ఉన్నారన్నారు. పార్టీ బలోపేతానికి యువత సైనికుల్లా పనిచేస్తారన్నారు. పాదయాత్రతో పార్టీ మరింత బలోపేతం కానున్నదన్నారు.

## ప్రజా ఉద్యమాలను బలపరచండి : సిపిఎం


పోరుమామిళ్ల రూరల్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త



స్థానిక పోరుమామిళ్లలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాలను బలపరచండి అంటూ సిపిఎం ఉద్యమ అభివృద్ధికి విరాళాలు ఇవ్వండి అంటూ భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్స్ సిపిఎం కార్యకర్తలు ఇంటింటికి కరపత్రం రూపంగా తీసుకెళ్లి విరాళాలు సేకరించడం జరుగుతుందని బుధవారం సిపిఎం పోరు మామిళ్ల మండల కార్యదర్శి భైరవ ప్రసాదు అన్నారు. ఈ సందర్భంగా సిపిఎం పూర్వం మండల కార్యదర్శి బైరప్రసాద్ మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమ వారసత్వంతో వామపక్ష ప్రజాతంత్ర లవ్కక శక్తుల ను కలుపుకుంటూ కమ్యూనిస్టు ఉన్నత విలువలతో కూడిన రాజకీయాలను చేపడుతున్న సిపిఎం ఉద్యమాలను బలపరచా వలసిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. మీరిచ్చే ప్రతి రూపాయి ప్రజా ఉద్యమానికి ఖర్చు చేసి మీ డబ్బుకు మరింత గౌరవాన్ని పెంచుతామని వినయ పూర్వకంగా మీ సహాయాన్ని అర్థిస్తున్నాం అని వారు అన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు గౌస్యవేగం, వరలక్షుమ్మ నాయకులు రవి రత్నం సిద్దమ్మ ఓబులమ్మ శ్రీనివాసులు, లక్షుమ్మ పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

## క్షయ రోగులకు పౌష్టికాహారం పంపిణి

మదనపల్లెక్రైం, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :



దాతల సాయంతో క్షయరోగులకు పౌష్టికాహారం పంపిణీ చేసినట్లు జిల్లా ప్రభుత్వాసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ పద్మాంజలీదేవి తెలిపారు. బుధ వారం ఆసుపత్రిలో మదనపల్లె పరిసర ప్రాంతాలకు చెందిన రోగులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయరోగులు మందులతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. దీంతో త్వరగా కొలుకుని వ్యాధి నుంచి బయడపడుతారన్నారు. ముఖ్యంగా ఆరు నెలల పాటు క్రమం తప్పకుండా మందులు వాడాల్సి ఉందన్నారు. పేద రోగులు ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతూ పౌష్టికాహారం తీసుకోకపోవడంతో వ్యాధి నుంచి రికవరీ కాలేకపోతున్నారన్నారు. రోగులకు సాయం చేయడంతో పాటు వారిని దత్తత్త తీసుకోవాల్సి న బాధ్యత అందరిపై ఉందంటూ ఆమె పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో టీబి సిబ్బంది ప్రభాకర్, దయాలసీసస్ రోగులు పాల్గొన్నారు.

## కెఎస్ఆర్ఎంలో ఐసిఐ స్టూడెంట్ లోకల్ చాప్టర్ ఆవిష్కరణ

కడప ఫిబ్రవరి 15, ప్రభాతవార్త



భారతదేశంలో ప్రముఖ ఇండియన్ కాంక్రీట్ సంస్థ మన రాష్ట్రంలో నూనతంగా 8వ శాఖను కెయస్ఆర్‌యం ఇంజినీరింగ్ కళాశాలలో ఆవిష్కరించింది. కార్యక్రమం సివిల్ ఇంజినీరింగ్ విభాగాధి పతి అధ్యక్షతన నిర్వహించారు. విశిష్ట అతిథులుగా భారత కాంక్రీట్ సంస్థ అధ్యక్షులు, భారత వెదురు పరిశోధన సంస్థ సంచాలకులు డాక్టర్ మొగల జగదీష్, యం.వి. గిరిధర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు చీఫ్ ఇంజినీర్ ప్రాజెక్టు ఆఫీసర్ జలవనరుల శాఖ (కడప) వారు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం మాట్లాడుతూ ఐసిఐ సంస్థ భారత దేశంలో ప్రముఖ వృత్తిపరమైన సంస్థలలో ఒకటన్నారు. అనంతరం విద్యార్థులు ఐసిఐ స్టూడెంట్ లోకల్ చాప్టర్‌లో సభ్యత్వం నమోదు చేసుకున్నారు. కార్యక్రమం లో కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల ఓబుల్‌రెడ్డి (నాని), ప్రధానా చార్యులు డాక్టర్ వి.ఎస్.ఎస్. మూర్తి, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ అమర్‌నాథ్ రెడ్డి, అచార్యులు డాక్టర్‌జి. శ్రీనివాసరెడ్డి, ప్రొఫెసర్లు టి. కిరణ్ కుమార్‌రెడ్డి, యు. గిరిధర్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.వి. రవి కిశోర్‌రెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## వేలంపాటల్లో రూ.6లక్షలు ఆదాయం

మదనపల్లెక్రైం, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :



వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాల వేలంపాటల ద్వారా రూ.600,620 లక్షలు ఆదాయం ప్రభుత్వానికి వచ్చినట్లు తాలూకా ఇన్‌చార్జ్ సిఐ మురళీక్రిష్ణ తెలిపారు. బుధవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏడు వాహనాలకు వేలంపాటు నిర్వ హించారు. ఇందులో భాగంగా డిపాజిట్ చెల్లించి వేలంపాటల్లో పాల్గొని వాహనాలను దక్కించుకొన్నారు. ఈ వేలంపాటల్లో రూ.6లోలు ఆదాయం వచ్చి నట్లు సిఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు చంద్రశేఖర్, సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## ద్విచక్రవాహనం చోరీ

మదనపల్లెక్రైం, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :

ఇంటివద్ద ఉంచిన ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. మదనపల్లె మండలం వలసపల్లె పంచాయితీ నవోదయ కాలనీకి చెందిన భానుమూర్తి పిటిఎం మండలం పట్టెంవాండ్లపల్లె పంచాయితీ కార్యదర్శిగా పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ద్విచక్రవాహనాన్ని ఇటీవల మదనపల్లె పట్టణంలోని అమ్మినేనివీధికి చెందిన స్నేహితుడు వెంకటరమణ తీసుకొచ్చాడు. కాగా ఇంటివద్ద నిలిపి ఉంచగా ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. దీంతో భానుమూర్తి రెండవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

## మహాశివరాత్రికి తవళలీకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

నిమ్మనపల్లె, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :

మహాశివరాత్రి పర్వదినాన్ని పురష్కరించుకొని ఈనెల 18న శనివారం, 19న ఆదివారం రెండు రోజులు పాటు తవళంలో వెలసిన శ్రీనేలమల్లేశ్వరస్వామి జాతర సందర్భంగా ప్రత్యే ఆర్టీసి బస్సులు నడపనున్నట్లు ఆర్టీసి రెండవ డిపో మేనే జర్ తెలిపారు. మదనపల్లెనుంచి తవళం గుడివరకు, నిమ్మనపల్లె నుండి తవళం గుడి వరకు, కందూరు నుంచి తవళం గుడి వరకు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు రెండు రోజులు పాటు నడపనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని శివభక్తులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## అద్దె ప్రాతిపదికన ఆర్టీసీ ఖాళీ స్థలాలు

మైదుకూరు ఫిబ్రవరి 15, ప్రభాతవార్త



మైదుకూరు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో గల పెట్రోల్ బంకు వెనక భాగములో ఉన్న ఖాళీ స్థలమును అద్దె ప్రాతిపదికన ఇవ్వనున్నట్లు డిపిటివో ఒక పత్రికా ప్రకటనలో తెలియజేశారు. బుధవారం మైదుకూరులో జరిగిన సమీక్ష సమావేశంలో టిపిటిఓ మాట్లాడుతూ మైదుకూరు డిపో లో ఖాళీగా ఉన్న 5ఎకరా ముల ఆర్టీసీ స్థలాన్ని 33 సంవత్సరాలకు అద్దెకు ఇవ్వనున్నారని. అందులో 2 ఎకరములు ఆర్టీసీ బస్టాండు పున నిర్మాణము కొరకు మిగిలిన 3 ఎకరములు కమర్షియల్ డెవలప్మెంట్ కొరకు ఇవ్వటం జరుగుతుందన్నారు. 15 సంవత్స రములు ప్రస్తుతం ఖాళీగా ఉన్న స్థలాలను లీజికి ఇవ్వడం జరుగుతుందని. ఇందులో మొత్తం 21 పారిశ్రామిక వ్యక్తులు పాల్గొనడం జరిగిందని సమావేశంలో మైదుకూరు డిపో మేనేజర్ రామకృష్ణ. ట్రాఫిక్ ఇంచార్జి మంజుల పాల్గొన్నారు.

## శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన అల్లాడుపల్లి శ్రీ వీరభద్రస్వామి ఆలయం


చాపాడు ఫిబ్రవరి 15, ప్రభాతవార్త



మహాశివరాత్రి ఉత్సవాలు జరిగే శివ క్షేత్రాలలో అల్లాడుపల్లె శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం ప్రసిద్ధ పుణ్యక్షేత్రం. కాలజ్ఞాన వేత్త శ్రీమద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి స్వయంగా శిల్పం చెక్కి ప్రతిష్టించినమహా పుణ్యక్షేత్రం. కొలిచే భక్తుల కొంగుబంగారంగా వెలసి ఉన్నాడు అల్లాడుపల్లె శ్రీ వీరభద్రుడు. స్వామి దర్శనం కోసం. కర్ణాటక. తమిళ నాడు. తెలంగాణ రాష్ట్రాల నుండి కూడా స్వామి దర్శనం కోసం వస్తుంటారు. మైదుకూరు ప్రొద్దుటూరు ప్రధాన రహదారి, చాపాడు మండల కేంద్రం అల్లాడుపల్లె వద్ద శ్రీ వీరభద్ర స్వామి ముఖద్వారాలు ఏర్పాటు చేసి ఉన్నారు. క్షేత్రానికి సమీపంలో ఉత్తర దక్షిణ వైపు ప్రవహించే కుముద్వతీ నది కలదు. దేవస్థానం నందు ప్రతి సోమవారము భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయడం జరుగుతుంది. మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 18 .19 తేదీలలో శివరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి .కే. శ్రీనివాసులు . ఆలయచైర్మన్ .జి టి. వెంకటసుబ్బా రెడ్డి తెలిపారు తెలిపారు. 18వ తేదీ తెల్లవారుజామున 3 గంటల నుండి స్వామి వారికి రుద్రాభిషేకములు. బిల్వార్చన లు. సహస్ర నామార్చనలు జరపనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం దశ శాంతి మంత్రములచే పాలాభిషేకములు. ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో మంత్రోచ్ఛరణ మధ్య ప్రత్యేక పూజలు రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ వారి ఆధ్వర్యంలో శివరాత్రి పర్వ దినాన భక్తుల సౌకర్యం కోసం ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఆదివారం వృషభరాజ్య ములచే బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## టిడిపి సవాల్‌పై సిబిఐ విచారణ కోరిన రాచమల్లు

ప్రొద్దుటూరు ఫిబ్రవరి 15, ప్రభాతవార్త



టిడిపి నాయకులు లోకేష్ ప్రవీణ్ కుమార్ రెడ్డి చేసిన సవాల్‌ను స్వీకరిస్తూ బుధవారం ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి విశాఖపట్నంలోని సిబిఐ దర్యాప్తు సంస్థ కార్యాలయానికి వెళ్లి స్వయంగా విచారణ కోరారు. అనంతరం సిబిఐ కార్యాలయం ఆవరణలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తనపై అసాంఘిక కార్యకలాపాలతో డబ్బు సంపాదిస్తున్నారన్న విమర్శలపై ఆయన ఘాటుగా స్పందించారు. తన సచ్చీలత నిరూపించుకునేందుకు సిబిఐ విచారణ కోరాలన్న సవాల్‌ను మనస్ఫూర్తిగా స్వీకరిస్తూ సిబిఐ కార్యాలయంలో విచారణ కోరుతూ లేఖ అందజేశారు. లోకేష్ చంద్రబాబు అక్రమ ఆస్తులపై సిబిఐ విచారణ కోరాలని ఎమ్మెల్యే రాచమల్లు డిమాండ్ చేశారు అలా కోరని పక్షంలో వారి విజ్ఞతకే వదిలేస్తానని అన్నారు. ఎమ్మెల్యే రాచమల్లుతో పాటు ఆప్కాబ్ చైర్ పర్సన్ ఝాన్సీ, పద్మశాలియ కార్పొరేషన్ చైర్మన్ జింకా విజయలక్ష్మి, ప్రొద్దు టూరు మున్సి పల్ చైర్మన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఎంపీపీ శేఖర్ యాదవ్, కౌన్సిలర్ వరకూటి ఓబుల్ రెడ్డి, రాష్ట్ర వైఎస్‌ఆర్‌సిపి అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు కాకర్ల నాగశేషారెడ్డి, కల్లూరు నాగేంద్ర రెడ్డి సౌరి సుభాష్ రెడ్డి ఉన్నారు.

## ప్రొద్దుటూరులో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి

ప్రొద్దుటూరు ఫిబ్రవరి 15, ప్రభాతవార్త



ప్రొద్దుటూరు పట్టణం కొర్రపాడు రోడ్డు వివేకానంద క్లాత్ మార్కెట్ లలో టీడీపీ ఇంఛార్జి జివి ప్రవీణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ఉక్కు ఫ్యాక్టరీకి రెండుసార్లు శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి ఎక్కడా చూడలేదని విమర్శించారు. కేవలం రాష్ట్ర యువతను మరోసారి మోసం చేయడానికి జగన్ కుట్రపడ్డారన్నారు. మూడున్న రేళ్లుగా రాష్ట్రంలో ఎవరూ సంతోషంగా లేరన్నారు. రానున్న ఎన్నికల్లో తెదేపా 160 స్థానాల్లో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తంచేశారు. కార్య క్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ముక్తియార్, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు, ప్రొద్దుటూరు రూరల్ మండల కన్వీనర్ బోడెల బాబుల రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ బండి విజయభాస్కర్ రెడ్డి, టీఎన్టీయూసి జిల్లా అధ్యక్షులు కుతుబుద్దీన్ ,రాజుపాలెం మండలం కన్వీనర్ ధని రెడ్డి విశ్వనాథరెడ్డి, పల్లా అంజిబాబు, రాష్ట్ర రైతు ఉపాధ్యక్షుడు వెంకట సుబ్బారెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి శ్రీనివాసుల యాదవ్, పద్మ నాభరెడ్డి, మేరువ మూర్తి, కడప పార్లమెంటు అధికార ప్రతినిధి దస్తగిరయ్య,లీగల్ సెల్ జిల్లా సెక్రెటరీ వినోద్ కుమార్, ప్రొద్దుటూరు నియోజక వర్గం బి సీ సెల్ అధ్యక్షుడు సురేంద్ర, పట్టణ అధ్యక్షుడు తమ్మిశెట్టి శ్రీనివాసులు, ప్రొద్దుటూరు రూరల్ మండలం ఉపాధ్యక్షుడు షరీఫ్ కవి, సుర సుర శ్రీనివాసులు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రాజెక్టు శంకు స్థాపనలపై ఉన్న శ్రద్ధ నిర్మాణాలపై లేదు : సిపిఐ

ప్రొద్దుటూరు ఫిబ్రవరి 15, ప్రభాతవార్త



రాష్ట్రంలో ప్రాజెక్టుల శంకుస్థాపనలపై ఉన్న మోజు నిర్మాణాలపై పాలకులకు లేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు బుధవారం సిపిఐ రాష్ట్ర నాయకులు ఈనెల 13 నుండి 22 వరకు చేపట్టిన పెండింగ్ ప్రాజెక్టుల పరిశీలనలో భాగంగా రాజోలి బ్రహ్మ సాగర్ ప్రాజెక్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజోలి రిజర్వాయర్ను 2008లో స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి శంకుస్థాపన చేశారని 15 ఏళ్లు గడిచిన నిర్మాణం పూర్తి కాలేదు అన్నారు అనంతరం సీఎంగా జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే రాజోలి రిజర్వాయర్ కు శంకుస్థాపన చేశారన్నారు కానీ ఇంతవరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టకపోవడం సిగ్గుచేటు అన్నారు. రాయలసీమ కరువు ప్రాంతం పట్ల మీ వైఖరి ఏంటో స్పష్టం చేయాల న్నారు బిజెపి సైతం రాయలసీమపై ఏమి మాట్లాడకపోవడాన్ని ఆయన ఖండించారు. అన్ని రాజకీయ పార్టీలు రైతు సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పోకడలను ఎండగడతామని తెలిపారు కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఓబులేసు ఈశ్వరయ్య సుబ్బరాయుడు పాల్గొన్నారు.

## తెలుగు యువత నాయకుల గృహ నిర్బంధం హేయమైన చర్య

### తెలుగు రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు

ప్రొద్దుటూరు ఫిబ్రవరి 15, ప్రభాతవార్త



రాష్ట్ర యువతను మరోసారి మోసం చేసేందుకు కడప జిల్లా ఉక్కు ఫ్యాక్టరీ భూమి పూజ చేసేందుకు వచ్చిన సీఎం జగన్ మోహన్ రెడ్డిని ప్రశ్నించే సిద్ధమైన తెలుగు యువత నాయకులను పోలీసులు గృహనిర్బంధం చేయడం హేయమైన చర్యగా రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు అభిప్రాయపడ్డారు. బుధవారం తెలుగు యువత నాయకులను పోలీసులు గృహ నిర్బంధం చేసిన సందర్భంగా ప్రకటన విడుదల చేశారు ఈ సందర్భంగా ప్రతి సంవత్సరం జనవరిలో సీఎం జగన్ జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తామని ఇంతవరకు ఎలాంటి జాబ్ క్యాలెండర్ విడుదల చేయక యువతను మోసం చేశారని విమర్శించారు జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీకి 2019లో శంకుస్థాపన చేసి మూడు న్నర సంవత్సరాలైనా కనీసం ప్రహరీ గోడ నిర్మించలేకపోయారని తిరిగి రెండోసారి భూమి పూజ పేరుతో సీఎం జగన్ జిల్లా పర్యటన కు రావడం విడ్డూరం గా ఉందన్నారు సీఎంగా జగన్మోహన్ రెడ్డి అనర్హుడని రాబో యే సార్వత్రిక ఎన్నికలలో గద్దె దించాలని రాష్ట్ర యువతకు ఆయన పిలుపునిచ్చారు.

## ప్రతి పేదవాడికి ప్రభుత్వ పథకాలు అందాలి

### - 12వ వార్డు ఇన్‌ఛార్జ్ తోటా నాగేశ్వరరావు

బద్వేలు, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రభుత్వ పథకాలు ప్రతి పేదవాడికి అందాలని, దీని కోసం వార్డు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని 12వ వార్డు వైసీపీ ఇన్‌ఛార్జ్ తోటా నాగేశ్వరరావు అన్నారు. వార్డుల్లో ప్రతి ఇంటికి వెళ్ళి ప్రభుత్వ పథకాలు అందకపోతే అందే విధంగా చూడాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో గృహ సారథులకు శిక్షణ ఇచ్చి చేపడుతున్న కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి వార్డులో ప్రజలకు ప్రభుత్వ పథకాలపైన అవగాహన కల్పించడంతో పాటు వారికి పథకాలు దరి చేరేలా చూడడం జరుగుతుందని నాగేశ్వరరావు పేర్కొన్నారు. 12వ వార్డులో సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందుతున్నాయని, అందని వారి వివరాలు సేకరించి వారికి అందేలా చూస్తున్నామన్నారు. ముఖ్యంగా పింఛన్లు, రేషన్ కార్డులు, జగనన్న ఇల్లులు లాంటి అనేక కార్యక్రమాలను సచివాలయ సిబ్బంది ద్వారా వివరాలు సేకరించి వారికి అందేలా చూడడంలో నిమగ్నమై ఉన్నామన్నారు. పథకాలు కుల మతాలకు, వర్గాలకు, పార్టీలకు అతీతంగా చేరవేయడం జరుగుతుందన్నారు. ఏ ప్రభుత్వం చేయని విధంగా వైసీపీ ప్రభుత్వం చేపడుతుందని వారు అన్నారు.

## శంకుస్థాపనలకు టెంకాయలు ఇస్తాం : కాంగ్రెస్

కడప ఏడురోడ్లు, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:



సీఎం జగన్ రెండో సారి కడప ఉక్కు పరిశ్రమకు టెంకాయ కొట్టడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నేడు కాంగ్రెస్ శ్రేణులు టెంకాయలతో నిరసన తెలిపారు. కడప జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ శ్రేణులు టెంకాయలు చూపిస్తూ తమ అసహనాన్ని వ్యక్తం చేశారు. నాలుగు సంవత్సరాల పాలన పూర్తవుతున్నా జగన్ కడప ఉక్కు ఫ్యాక్టరీ పనులు పూర్తి కాక ముందుగా చెప్పిన విధంగా 25 వేల మందికి ఉద్యోగాలు రాక, పరిశ్రమ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని ఆయన అన్నారు. కడప ఉక్కు పరిశ్రమ వస్తే నేరుగా 25వేల మందికి, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ బండి జకరయ్య, తిరుమలేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌గౌడ్, గౌరీ, భరత్, మౌలా, రత్నం పాల్గొన్నారు.

## విద్యార్థులు పుస్తక పఠనం అలవరుచుకోవాలి

కడప ఏడురోడ్లు, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:



ప్రస్తుత సమాజంలో విద్యార్థులు పుస్తక పఠనం అలవరుచుకోవాలని ఆ దిశగా ఉపాధ్యాయులు, పెద్దలు అవగాహన కల్పించాలని దంత వైద్యులు సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ నజుముద్దీన్ అన్నారు. కడప నగరంలోని మోచంపేటలో ఉర్దూ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో సోషల్ జస్టిస్ ఫోర్ ఇంటర్నేషనల్ సివిల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నగర అధ్యక్షులు లయన్ పఠాన్ ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం యువత సెల్ లోకంగా సోషల్ మీడియాకు బానిసవడం విచారకరమన్నారు. దీనివల్ల అనర్థాలు ఎక్కువగా ఉంటాయన్నారు. పుస్తకం చదవడం వల్ల ఎంతో కొంత జ్ఞానం వస్తుం దన్నారు. విద్యార్థులు తరచూ లైబ్రరీలకు వెళ్లే అలవాటు చేసుకోవాలని సూచిం చారు. అనంతరం పిల్లలకు విద్యా సామగ్రితో పాటు కొన్ని కథల పుస్తకాలు పంపిణీ చేశరు. కార్యక్రమంలో సోషల్ జస్టిస్ ఫర్ నేషనల్ సివిల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ సుంకర కేసు బాదుల్లా, ప్రధానోపాధ్యా యుడు జాబీర్ అహ్మద్ రఫీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తైక్వాండో సౌత్‌జోన్‌లో గోల్డ్‌మెడల్ సాధించిన అఫ్జల్‌బాషా

కడప ఏడురోడ్లు, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:



ఇటీవల తిరుపతి విశ్వం విద్యా సంస్థల్లో ఫిబ్రవరి 11, 12 తేదీల్లో జరిగిన టెంపుల్ ఆఫ్ తైక్వాండో భారత్ ఫెస్ట్ ఓపెన్ ఛాంపియన్‌షిప్ 2023లో కడప నగరపాలక ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి రెండు గోల్డ్ మెడల్ సాధించడంలో జంషీర్ మాస్టర్ కృషి ఎంతో అభినందనీయమని 25వ డివిజన్ కార్పొరేటర్ కె.సూర్యనారాయణ రావు అన్నారు. బుధవారం నగరపాలక ఉన్నత పాఠశాలలో అఫ్జల్‌బాషాను ఇన్‌ఛార్జి ప్రధానో పాధ్యాయులు కలీముల్లా ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సూర్యనారాయణ రావు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో కూడా రాణించాలని తద్వారా విద్య ఉద్యోగాల్లో రిజర్వేషన్ పొందగలరని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ చాంద్‌బాషా, ఉపాధ్యాయులు ఇలియాస్ బాషా, ఖాదర్ బాషా, మహబూబ్ బాషా, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జుబేర్, ఆయుబ్ పాల్గొన్నారు.

## నాకు.. నా కుటుంబానికి ప్రాణ హాని ఉంది

కడప వైద్యవిభాగం, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:



తమ భూమి 7 సెంట్లు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకొని, నాకు న్యాయం చేయాలని 2వ డివిజన్ చలమారెడ్డిపల్లెకు చెందిన తెల్లపాటి ధనుంజయ తెలిపారు. విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చలమారెడ్డిపల్లె ఉక్కాయపల్లి 1066/5 సర్వే నెంబరులో 7 సెంట్లు భూమి ఉందని అయితే మా పెద్దనాయన కుమార్తె వెంకట లక్షుమ్మ కుమారుడు తెల్ల పాటి చిన్నయ్య ఇద్దరు భూమిని కబ్జా చేసి కంచ నాటడం జరిగిందని తెలిపారు. వారి నుంచి నాకు నా కుటుంబానికి ప్రాణ హాని ఉందని వారి మీద ఎస్పీకి ఫిర్యాదు చేశానని తెలిపారు. ఆ భూమికి సంబంధించి అన్ని హక్కులు కలిగిన పత్రాలు ఉన్నాయని 2013లో న్యాయ వ్యవస్థ కూడా తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందని తెలిపారు. అయితే చిన్నయ్య వెంకటలక్షుమ్మ కొంత మంది రౌడీలను అల్లరి మూకలను తీసుకొని ప్రస్తుతం గోడలను నిర్మిస్తు న్నారు. న్యాయ వ్యవస్థ ఆదేశాలు కూడా పట్టించుకోకుండా ఇష్టాను సారంగా గోడ కడుతున్నారు. వారిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయండి అని వేడుకుంటున్నారు.

## స్వర్గస్తులైన ఖాన్‌ఖాఏ బుఖారియా పీఠాధిపతి మొహిద్దీన్ బుఖారీ సాహెబ్

కడప ఏడురోడ్లు, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:



నగరంలోని రహమతుల్లా వీధిలో ఉన్న ఖాన్ ఖాయే బుఖారియా పీఠాధిపతి రిటైర్డ్ జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్, బుఖారియా ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ హాజీ సయ్యద్ షా మొహిద్దీన్ బుఖారి సాహెబ్ అనారోగ్యంతో మంగళ వారం రాత్రి స్వర్గస్తులైనారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, టీడీపీ కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి అమీర్‌బాబు, రాష్ట్ర హజ్ కమిటీ మాజీ డైరెక్టర్ మగ్దూం బుఖారి, ప్రభుత్వ ఖాజీ సయ్యద్ సిరాజుద్దీన్ బుఖారి, హబీబ్ బుఖారి, ముస్లిం ప్రముఖులు, శిష్యులు భౌతిక కాయాన్ని దర్శించుకున్నారు. బుధవారం సాయంత్రం అసర్ నమాజ్ తరువాత అంత్యక్రియలు నిర్వహించారని పీఠాధిపతి మొహిద్దీన్ బుఖారి సాహెబ్ తనయుడు ఉలమా అయిమ్మ కమిటీ ప్రెసిడెంట్ నిజాముద్దీన్ బుఖారి తెలిపారు.

# ప్రతి ఒక్కరూ సేవా భావం కలిగి ఉండాలి

### వాసవి, వనిత క్లబ్ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం - వాసవీ క్లబ్ గవర్నర్ తల్లం సుధాకర్

బద్వేలు అర్బన్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :

బద్వేలు ప్రాంతంలో ఉన్నటువంటి నిరుపేద ఆర్యవైశ్యులకు చేయూతనిచ్చే లక్ష్యంతో వాసవీ, వనిత క్లబ్ సభ్యులు సేవా భావం కలిగి ఉండాలని వాసవీ క్లబ్ గవర్నర్ తల్లం సుధాకర్ అన్నారు. బుధవారం శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి సన్నిధిలో వాసవీ, వనిత క్లబ్ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం వాసవీ క్లబ్ గవర్నర్ తల్లం సుధాకర్, వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు పాలకుర్తి గాయత్రిల ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రమాణ స్వీకారానికి విచ్చేసిన వాసవీ క్లబ్ గవర్నర్ తల్లం సుధాకర్‌తో పాటు పలువురికి స్వాగతం పలికారు. వాసవీ క్లబ్ అధ్యక్షులుగా చిందుకూరు వెంకట శివ కుమార్, సెక్రటరీగా యాదాళ్ళ పవన్ కుమార్, ట్రెజరర్ పెసల సుధాకర్, వనిత క్లబ్ అధ్యక్షురాలుగా తులసి రాధిక, సెక్రటరి పెసల శ్రీవాణి, ట్రెజరర్ ముచ్చర్ల మాధురి లు అమ్మవారి సన్నిధిలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్ గవర్నర్ తల్లం సుధాకర్ మాట్లాడుతూ వాసవీ, వనిత క్లబ్‌ల ద్వారా గత అనేక సంవత్సరాల నుండి అంతర్జాతీయ స్థాయి నుండి ఎంతో మంది నిరుపేద కుటుంబాలకు చేయూతనిచ్చే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ కృషి చేస్తున్నారన్నారు. ముఖ్యంగా బద్వేలు పట్టణంలో సుమారు 8 సంవత్సరాలు పైబడి వాసవీ, వనిత క్లబ్ ద్వారా పట్టణంలో నిరుపేద ఆర్యవైశ్యులకు ఉపాధి కొరకు వడ్డీలేని రుణాలు, ప్రతి నెలా అమృత కలశం సరుకులు, అలాగే సరస్వతీ మందిరం ఏర్పాటు, భవిత పాఠశాలలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు చేయూతనివ్వడం, మైదుకూరు రోడ్‌లోని టీటీడి మండపం వద్ద ప్రయాణికులు కూర్చునేందుకు బస్ షెల్టర్, ప్రతి నెలా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు భోజన వసతితో పాటు అనేక రకాల సేవా కార్యక్రమాలు చేపట్టడంలో బద్వేలు పట్టణంలో ఎంతగానో సేవలందిస్తున్నారన్నారు. ప్రస్తుతం ప్రమాణ స్వీకారం



వాసవీ క్లబ్ గవర్నర్‌ను సత్కరిస్తున్న ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె.వి.సుబ్బారావు.

చేసిన వాసవీ, వనిత క్లబ్ సభ్యులు కూడా ప్రతి ఒక్కరూ సేవా గుణంతో ముందుకు పోయి నిరుపేద ఆర్యవైశ్యులకు అన్ని రకాలుగా చేయూతనిచ్చే లక్ష్యంతో కృషి చేయాలని వారన్నారు. అనంతరం ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె.వి.సుబ్బారావు, గౌరవ అధ్యక్షులు పి.వి.ఎన్.ప్రసాద్, సాయికృష్ణ, ప్రిన్సిపాల్ చిన్ని బసవయ్య, మహిళా మండలి అధ్యక్షురాలు చింతకుంట ధనమ్మ, మహిళా మండలి స్టేట్ ఉపాధ్యక్షురాలు కొండపల్లి దేవితో పాటు పలువురు మాట్లాడుతూ బద్వేలు పట్టణంలో దాతల సహకారంతో అనేక సంవత్సరాలుగా పేద ఆర్యవైశ్యులకు అవసరమైన అన్ని రకాల సేవా కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ మాజీ అధ్యక్షులు దొంతంశెట్టి జయకుమార్, వైభవ్ ప్రసాద్, చాటకొండు వెంకటసుబ్బయ్య, వనిత క్లబ్ మాజీ అధ్యక్షురాలు పత్తి రమాదేవి, మునగా చలమయ్య, పబ్బతి చక్రపాణి, గుబ్బా వెంకటసుబ్బయ్య, బచ్చు నాగలక్ష్మి, దేవతి లలిత, పబ్బతి శ్రీదేవి, తిరువీధి సుజాతతో పాటు పలువురు వాసవీ, వనిత క్లబ్, ఆర్యవైశ్య వర్తక సంఘం, మహిళా మండలి, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

## 250 మందికి కంటి వైద్య పరీక్షలు



చెన్నూరు, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :

కొండపేట నందు బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది, కీర్తిశేషులు పెడబల్లి సుబ్బారెడ్డి (కొండపేట రెడ్డి) కీర్తిశేషులు పెడబల్లె శివారెడ్డి (మాజీ సర్పంచ్) జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పుష్పగిరి కంటి ఆసుపత్రి వారిచే కొండపేట బంగ్లా నందు బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో డాక్టర్ జిగీష (ఆర్థమాలజిస్ట్), డాక్టర్ శ్రావణి ( ఆర్తమాలజిస్ట్) వెంకటేశ్వర్లు , అఖిల ఆప్టోమాలజిస్ట్‌ల నేతృత్వంలో ఎల్ఈడి బోర్డ్స్, విజన్ బోర్డ్స్, ఏ ఆర్ మిషన్, ట్రైబ్ బాక్సులు, కంప్యూటర్ లలో కంటికి సంబంధించిన అదునాత టెక్నాలజీ తో ప్రజలకు ప్రత్యేక కంటి పరీక్షలు నిర్వహించడం జరిగింది ,అలాగే శస్త్ర చికిత్సలు నిర్వహించి, అవసరమైన వారికి పుష్పగిరి కంటి ఆసుపత్రి నందు ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తారు. పుష్పగిరి కంటి ఆసుపత్రి క్యాంపు కోఆర్డినేటర్ అమర్నాథ్ రెడ్డి తెలిపారు. అంతే కాకుండా ఇందులో ప్రత్యేకంగా శుక్లములకు ఆధునిక ఆపరేషన్, మెల్లకన్ను వారికి ఆపరేషన్, రెటీనా ఆపరేషన్, కార్నియా ఆపరేషన్, గ్లూకోమా( నీటి కాసులు) ఆపరేషన్లు, కంటి ప్లాస్టిక్ సర్జరీ, చిన్నపిల్లల కంటి చికిత్స ఆపరేషన్లు, కంటి శుక్లాలు గుర్తించి వారికి కంటి( కుట్లు లేని) ఆపరేషన్ నిర్వహించబడునని, కాంటాక్ట్ లెన్స్, వంటి మొదలగు శస్త్ర చికిత్సలు, నిర్వహించబడతాయని ఆయన తెలియజేశారు, ఆపరేషన్లు చేయించుకుని వారు ఆధార్ కార్డు, అదేవిధంగా ఆరోగ్యశ్రీ కార్డు తప్పక తీసుకురావాలని ఆయన తెలియజేశారు, కంటి వైద్య శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరికి పెడబల్లి సుధాకర్ రెడ్డి,శ్రీధర్ రెడ్డిలు భోజన వసతి ఏర్పాటు చేయడం జరిగింది, ఈ వైద్య శిబిరానికి ముఖ్య అతిథులుగా మండలంలోని పలువురు వైయస్సార్సీపి, తెలుగుదేశం, కాంగ్రెస్, బిజెపి నాయకులు రావడం జరిగింది, కీర్తిశేషులు పెడబల్లె సుబ్బారెడ్డి( కొండపేట రెడ్డి) కీర్తిశేషులు పెడబల్లె శివారెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ ఉచిత కంటి వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలకు ధన్యవాలని పెడబల్లె సుధాకర్ రెడ్డి, పెడబల్లె శ్రీధర్ రెడ్డిలు తెలిపారు.

# జాతరలో గట్టి బందోబస్తు ఏర్పాటు



లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:

అనంతపురం గంగమ్మ జాతరలో ఈనెల 20, 21, 22 తేదీల్లో జరగనున్న గంగమ్మ జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని అన్నమయ్య జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పేర్కొన్నారు. బుధవారం గంగమ్మ జాతర ప్రాంగణం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్సు డిపో ఏర్పాటు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు, ద్విచక్ర వాహనాల ఏర్పాటు అన్ని పరిశీలించారు. రాయచోటి, పులివెందుల, కడప డిపో నుంచి జాతర లేక వచ్చే బస్సులను రూట్ మ్యాప్‌ను ఆయన పరిశీలించారు. ఆశ్లీల నృత్యాల ప్రదర్శించిన కఠిన చర్యలు తప్పవన్నారు. రెండు రోజుల పాటు జాతరకు వచ్చే భక్తులు చాంది నీ బండ్లతో జాతరకు వచ్చే భక్తులకు అశ్లీలత నృత్య ప్రదర్శనలు జరపకూడ దన్నారు. చాందినీ బండ్లు అమ్మవారి దగ్గరకు వచ్చే సమయంలో విద్యుత్తు తీగ లు ఇబ్బందులు లేకుండా జాతరకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ వరప్రసాద్, ఎస్సై వినోద్‌కుమార్, ఆలయ ఛైర్మన్ నరసింహారెడ్డి, కార్య నిర్వహణాధికారి రవీంద్రరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యవసాయ శాఖ సమీక్ష సమావేశం



పెండ్లిమర్రి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:

మండలంలోని వ్యవసాయ శాఖ సిబ్బందికి సహాయ వ్యవసాయ సంచాలకులు సమీక్ష సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. కార్యక్రమంలో రబీ సీజన్‌కు సంబం ధించి ఇంకా క్రాప్ బుకింగ్ ఉంటే త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. పీఎం కిసాన్‌కు సంబంధించి ఇంకా ఎవరైనా రైతులు ఈకేవైసీ చేయించుకోని వారు ఉంటే తప్పక చేయించుకోవా లన్నారు. ప్రతి రోజు ఉదయం 10 గంటల లోపు కియోస్క్ ఆన్‌లైన్ చేసి వైఎస్ఆర్ యాప్‌లో అటెండెన్స్ వేయాలని తెలిపారు. ప్రతి ఆర్‌బీకేలో రికార్డులు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ప్రతి ఆర్‌బీకే నందు ఎరువులు తప్పనిసరిగా రైతులకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. రూ.5335 క్వింటా శనగలను ప్రభుత్వం ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేయడం జరుగుతుందని కావున శనగ పంట సాగు చేసిన వారు ఆర్‌బీకేల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు.

# వాగ్దానాలు తుంగలో తొక్కిన జగన్ : టిడిపి



ప్రొద్దుటూరు ఫిబ్రవరి 15, ప్రభాతవార్త

రాష్ట్రంలో అధికారం చేపట్టేందుకు ఎన్నో వాగ్దానాలు చేసిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన అనంతరం తుంగలోతొక్కారని టిడిపి బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సుంకర వేణుగోపాల్ తెలిపారు. బుధవారం ఆయన సమావేశంలో మాట్లాడుతూ సీఎం జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తన పాదయాత్రలో ఎన్నో రకాల వాగ్దానాలు చేశారని గుర్తు చేశారు.నిరుద్యోగులకు ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని డీఎస్సీ కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేస్తానని చేనేత కార్మికులకు 2 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందిస్తానని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని మోసపూరితమైన వాగ్దానాలు చేసి ఓట్లు వేయించుకొని అధికారం చేపట్టిన జగన్‌ను రాబోయే ఎన్నికలలో చిత్తుచిత్తుగా ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి దేవాంగ సాధికారిక కమిటీ రాష్ట్ర కార్యదర్శి అంపావతిన నాగ సుబ్బరాయుడు కడప పార్లమెంటు బిసి కార్యనిర్వాహక కార్యదర్శి సి సుబ్బరాజు జిల్లా నాయి బ్రాహ్మణ కార్యదర్శి మహేష్ కుమార్ ఎన్టీఆర్ అభిమాని రమణ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో రామసుబ్బయ్య మృతి

## పలువురు నాయకుల సంతాపం



బద్వేలు అర్బన్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :

హర్షిత హాస్పిటల్ డా॥ గుర్రాల హరికృష్ణ మామ రామిశెట్టి రామసుబ్బయ్య (65) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం అకస్మాత్తుగా మృతిచెందారు. వ్యవసాయదారుడిగా, రియల్ ఎస్టేట్ మధ్యవర్తిగా ఉంటూ అందరితో కలిసిమెలిసి పలువురి ప్రజల ఆదరాభిమానాలు పొంది మంచితనానికి మారుపేరుగా నిలిచిన రామసుబ్బయ్య మృతి పలువురిని కలవరపరిచింది. మృతుడు రామసుబ్బయ్యకు భార్య రమణమ్మతో పాటు, కుమార్తె రామలక్ష్మి కలరు. బాగా ఆరోగ్యంగా ఉన్న రామసుబ్బయ్య అకస్మాత్తుగా మృతిచెందడం పట్ల వారి కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు సింగసాని శివయ్య, అడా ఛైర్మెన్ సింగసాని గురుమోహన్, మున్సిపల్ వైస్ ఛైర్మెన్ గోపాలస్వామి, నరసింహా చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్ నరసింహ, అనిల్ కుమార్ రాజు, బిజ్జం రమణ, ఆవుల శ్రీనివాసులు, అంజి, మార్కెట్ యార్డు డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్, బచ్చు సురేష్ బాబు, ఎస్ఆర్ఎన్‌బి రెసిడెన్సీ అధినేత డా॥ దిలీప్ గుప్తాతో పాటు పలువురు డాక్టర్లు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# రూపుదిద్దుకుంటున్న డివైడర్, మురికి కాలువ నిర్మాణాలు

కడప కార్పొరేషన్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:

కడప నగరంలోని ఈస్ట్‌జోన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నట్లు డీఈఈ కరీముల్లా ఖాన్ పేర్కొన్నారు. కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ ఆదేశాల మేర నిర్మాణ పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. బుధవారం కడప నగరపాలక సంస్థలో ఏఈ స్వరూప, వార్డు సదుపాయాల కార్యదర్శి వై.శ్రీకాంత్‌లతో కలిసి డీఈఈ కరీముల్లా మాట్లాడుతూ కడప నగరంలోని రాజంపేట మార్గంలోని సంజన్న సర్కిల్ నుంచి వైఎస్ఆర్ విగ్రహం కూడలి వరకు 1.6 కి.మీ మేరా డివైడర్ నిర్మాణం పనులు జరుగుతున్నట్లు చెప్పారు. రూ.36లక్షలతో డివైడర్, రూ.50లక్షలతో గ్రీనరీ, డివైడర్ల మధ్యలో మట్టి పనులు రూ.44.50లక్షలతో పెయింట్, గ్రిల్స్ వంటివి నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే మాసాపేటలో మురికి కాలువ నిర్మాణ పనులు జరుగుతున్నట్లు చెప్పారు.

# సీఎం జగన్ పాలనలో శంకుస్థాపనలు, భూమిపూజలకు విలువ లేదు

## – ఏపీసీసీ మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి



వేంపల్లె, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో శంకుస్థాపనలు, భూమిపూజలకు విలువ లేకుండా పోయిందని ఏపీసీసీ మీడియా ఛైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. బుధవారం వేంపల్లెలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తే ఆ పనులు గడువులోగా లేదా కొంచెం అటు, ఇటు పూర్తయి ప్రారంభానికి నోచుకుంటాయని అన్నారు. అయితే జగన్‌మోహన్ రెడ్డి శంకుస్థాపన చేసిన పనులు ప్రచార కార్యక్రమాలుగా మారాయని, ఉత్తుత్తి శంకుస్థాపనలుగా తయారయ్యాయని అన్నారు. కడపజిల్లాలోనే ఇలాంటి పనులు చాలా ఉన్నాయని తెలిపారు. బుగ్గవంక సుందరీకరణ, ఇండస్ట్రియల్ హబ్, కుందూ–పెన్నా ఎత్తిపోతల పథకం, చాలా ఉన్నాయని తెలిపారు. ఇక రాష్ట్ర రాజధాని విషయంలో సీఎం ఒక మాట చెబితే మంత్రులు మరోమాట చెబుతున్నారన్నారు. ఎవరి మాట నమ్మాలో తెలియక ప్రజలు అయోమయానికి గురవుతున్నా రన్నారు. ఇలాంటి సంఘటన ఏ రాష్ట్రంలో జరిగి ఉండదని చెప్పారు.

**తులసిరెడ్డితో భేటీ అయిన మాజీమంత్రి శైలజానాథ్ :**

వేంపల్లెలో ఉన్న తులసిరెడ్డితో మాజీమంత్రి శైలజానాథ్ భేటీ అయ్యారు. రాష్ట్ర రాజకీయాలపై సుదీర్ఘంగా చర్చించారు.

# పోలేరమ్మగుడికి ఆర్థికసాయం



గుర్రంకొండ, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త

గుర్రంకొండ హరిజనవాడలో పోలే రమ్మగుడి నిర్మాణానికి పార్లమెంట్ సభ్యు లు వెంకటమిధున్‌రెడ్డి బుధవారం లక్ష రూపాయల ఆర్థిక సాయం చేశారు. కొన్ని సంవత్సరాలుగా చేయూత లేక నిర్మాణ పనులు చేపట్టలేక పోయామని హరిజనవాడ ప్రజలు అన్నారు. గుర్రంకొండ సర్పంచ్ జమీర్‌అలీఖాన్ హరిజనవాడ ప్రజల సమస్యను యమ్‌పి దృష్టికి తీసుకు పోయి యమ్‌పి చేసిన ఆర్థిక సాయాన్ని నాయకులు హరిజనవాడ ప్రజలకు పంపిణీ చేశారు. ఇందుకు కృషి చేసిన వారైన గుర్రంకొండ సర్పంచ్ జమీర్‌అలీ ఖాన్, ఎంపిటిసి ఖధీర్, నాయిని శివశంకర్, నూర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

# బొగ్గుల బట్టీలను గ్రామానికి దూరంగా తరలించాలి



వేంపల్లె, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :

వేంపల్లె మండలంలోని ముతుకూరు గ్రామంలో ఉన్న బొగ్గుల బట్టీలను గ్రామా నికి దూరంగా తరలించాలని బొగ్గుల బట్టీల నిర్వాహకులను తహసీల్దారు చంద్ర శేఖర్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం ఆ గ్రామంలో నెలకొన్న బొగ్గులబట్టి ప్రాంతా లను ఫారెస్టు సెక్షన్ అధికారి కాశిరెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. నిర్వాహకు లకు తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. కొన్ని రోజులుగా బట్టీల ద్వారా వెలు వడే కాలుష్యానికి గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు.

**మానవత్వం చాటుకున్న తహసీల్దారు :** అనాథ బాలుడిని వేంపల్లె తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి చేరదీసి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా అనాథ బాలుడిని స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి పాఠ్య పుస్తకాలు, కొత్తబట్టలు అందజేశారు. వేంపల్లె పట్టణానికి చెందిన తల్లి దండ్రు లు బాలుడిని వదిలేసి ఎక్కడికో వెళ్లిపోవడంతో తహసీల్దారు చేరదీసి తనవంత సహాయ, సహకారాలు అందించారు.

# రైతులకు రిలయన్స్ మార్కెటింగ్ అందుబాటులోకి



మైదుకూరు ఫిబ్రవరి 15, ప్రభాతవార్త

మైదుకూరు మండలం బద్వేల్ రోడ్డులోని జీవీసత్రం లో బేయర్ కంపెనీ వారు ఏర్పాటుచేసిన సమావేశంలో బేయర్ కంపెనీ ప్రవీణ్ రెడ్డి. అయన మాట్లాడుతూ జీ వి సత్రం పరిధిలో రైతులు పండించిన పంటకు మంచి గిట్టు బాటు ధర కల్పించేలా సహాయం చేస్తూ రైతులకు ఎలాంటి మోసాలు జరగకుండా మంచి గిట్టుబాటు ధర కల్పిస్తున్నామన్నారు. దానితోపాటు బేయర్ కంపెనీ వాళ్ళు పురుగుమందులు గ్రోత్ ప్రమోటర్స్ సప్లై చేస్తున్నారు. ఈ పురుగు మందులు కూడా చాలా బాగా పని చేస్తున్నాయన్నారు . మిర్చి, టమోటా పంటలకు కాయ తొలుచు పురుగు, కాండం తొలుచు పురుగు. నివారణకు మంచి మందులు అమ్ముతున్నామన్నారు. కార్యక్రమంలో వనిపెంట, జీవి సత్రం పరిధిలో ఉన్న రైతులు మరియు బేయర్ కంపెనీలో పనిచేస్తున్న స్వరూప. ప్రవీణ్ రెడ్డి రిలయన్స్ కంపెనీ స్టేట్ డైరెక్టర్ సోమశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కడపలో తెలుగు తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలి

## – మొల్ల సాహితీ పీఠం అధ్యక్షులు హనుమంతరావు



బద్వేలు, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :

వైఎస్సార్ జిల్లా కేంద్రమైన కడప నగర కార్పోరేషన్ పరిధిలో తెలుగు జాతికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన తెలుగు తల్లి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని మహా కవయిత్రి మొల్ల సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ డా॥ గానుగపెంట హనుమంతరావు, పీఠం కార్యవర్గ సభ్యులు శేషారెడ్డి, కర్లపూడి కృష్ణ విజ్ఞప్తి చేశారు. ఇందుకు తమ వంతు విరాళంగా 10 వేల రూపాయలు అందిస్తానని మొల్ల సాహితీ పీఠం అధ్యక్షులు విద్వాన్ గానుగపెంట హనుమంత రావు ప్రకటించారు. అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం ఈ నెల 21వ తేదీన ప్రభుత్వ పక్షాన నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు, నగర పాలక కమీషనర్‌కు గత వారం వినతిపత్రాలు సమర్పించామని తెలిపారు. సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు చేపట్టి విద్యార్థులకు, ప్రజలకు మాతృ భాషపై మమకారం కలిగించాలన్నారు. అనంతరం తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాల వేసి శంకరంబాడి సుందరాచారి రచించిన మా తెలుగు తల్లికి మల్లెపూ దండ అను గీతాన్ని సామూహికంగా ఆలపించారు.

# ఒకే స్టీల్ ప్లాంట్‌కు రెండు సార్లు శంకుస్థాపన..



జమ్మలమడుగు, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:

జమ్మలమడుగు తెదేపా కార్యాలయంలో బుధవారం కడప జిల్లా పార్ల మెంటు అధ్యక్షులు మల్లెల లింగారెడ్డి, జమ్మలమడుగు తెదేపా ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డిలు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సీఎం జగన్ ఒకే స్టీల్ ప్లాంట్‌కు రెండు సార్లు శంకుస్థాపన చేసిన ఘనత ఆయనే దక్కుతుందన్నారు. 2019లో జగన్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన చేసినప్పుడు 3 సంవత్సరాలలో నిర్మాణం పూర్తి చేస్తామని 15వేల కోట్లు పెట్టుబడితో 25వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పడం మోసం కాదా అన్నారు. ఈ రోజు శంకుస్థాపన కార్యక్రమంలో జిందాల్ మొదటి దశ 36 నెలల్లో పూర్తి చేస్తామని చెప్పగా ముఖ్యమంత్రి 24 నెలల్లో పూర్తి చేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికలు 13 నెలలు ఉండగా ఎన్నికల తరువాత కూడా తమరు ముఖ్యమంత్రిగా ఉంటారా, రెండో దశ చెప్పిన 5 సంవత్సరాలకు రెండు ఎన్నికలు అయిపోతాయి. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉండగా స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేయడం వలన ఉపాధ్యాయ పట్టభద్రులను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. జిందాల్ కంపెనీకి అప్పజెప్పడంలో మతలబు ఉంది. క్విడ్ ప్రోకో (నీకిది నాకది) జిందాల్‌కు రామాయపట్నం పోర్టు లో రెండు బెర్తులను కేటాయించడం ఒక కుంభకోణం కాదా అన్నారు. ఈ కార్య క్రమంలో రమణారెడ్డి, బుసిరెడ్డి, సోఫా రాజా, సిద్దయ్య పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహం ఎదుట దివ్యాంగుల నిరసన



కడప కార్పొరేషన్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:

దివ్యాంగురాలు రాణిని హత్య చేసిన హంతకులను సత్వరమే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలని సంఘ సేవకులు సలావుద్దీన్, దివ్యాంగుల సంఘం నేత సుబ్బయ్య, ఆర్పీపీ నేత రవిశంకర్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. రాణి హత్యోదంతంపై పోలీసుల తీరును నిరసిస్తూ వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో పలు సంఘాల ప్రతినిధులు బుధవారం కడపలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగురాలు దారుణ హత్యకు గురై రోజులు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే లేడన్నారు. ఇతర ప్రముఖులు హత్యకు గురైతే ఆఘమేఘాల మీద నిందితులను అరెస్టు చేసి పోలీసులు ఈ విషయంగా పట్టీపట్టనట్లు వ్యవహరించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా పోలీసులు రాణి హత్యకు కారకులైన వారిని తక్షణమే అరెస్టు చేసి వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# మల్లయ్యకొండకు ప్రతి రోజు ఆర్టీసీ సేవలు

## - జిల్లా రవాణాశాఖాధికారి జగదీష్



దువ్వూరు, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె సమీపంలో వెలసిన భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయానికి ప్రతి రోజూ ఆర్టీసీ సేవలు కొనసాగిస్తామని జిల్లా రవాణా శాఖాధికారి జగదీష్ హామీ ఇచ్చారు. బుధవారం ఆయన మదనపల్లె డిపో మేనేజర్ వెంకటరామిరెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ రేవతి, మల్లయ్య కొండ ఛైర్మన్ కె.ఆర్.మల్‌రెడ్డి సమక్షంలో ఆర్టీసీ ట్రైల్‌రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లయ్యకొండ రోడ్డుకు నిపుణులైన డ్రైవర్లతో సురక్షితమైన ప్రయాణం నిర్వహించడానికి కృషి చేస్తామన్నారు. మల్లయ్యకొండకు చరిత్రలో లేని విధంగా ఆలయ నిర్మాణం, రోడ్డు నిర్మాణం, తాగునీరు, భక్తులకు సౌకర్యాలు ఎవరు చేయించారో లక్షలాది మంది భక్తులకు తెలుసని వారు చేసిన కృషి చారిత్రాత్మకంగా నిలవడం ఖాయమన్నారు. భక్తుల సౌకర్యార్థం దేవాదాయశాఖ ఈవో రమణ, కమిటీ సభ్యులు, అన్నదాన కమిటీ సభ్యులు చేస్తున్న సహకారం మరువలేనిదని అన్నారు. ఆయన వెంట ఆర్టీసీ అధికారులు, మల్లయ్యకొండ దేవాదాయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ సిలిండర్ డోర్ డెలివరీపై అదనపు ఛార్జీలు

## - బిల్లుకు అదనంగా రూ.50 నుంచి రూ.60 వసూలు



సిద్దవటం, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:

మండలంలోని గ్యాస్ వినియోగదారులకు గ్యాస్ సిలిండర్ డోర్ డెలివరీపై అదనంగా గ్యాస్ డెలివరీ బాయ్‌కు చెల్లిస్తున్నట్లు పలువురు బహిరంగంగానే తెలుపుతున్నారు. గ్యాస్ సిలిండర్ బిల్లుకు అదనంగా రూ.50 నుంచి రూ.60 వరకు డెలివరీ బాయ్ వసూలు చేస్తున్నారని అదనపు డబ్బులు ఇవ్వకుంటే గ్యాస్ ఏజెన్సీ నుంచి తెచ్చుకోవాలని చెప్పడంతో గత్యంతరం లేక బిల్లుకు అదనంగా చెల్లించి గ్యాస్ సిలిండర్ను తీసుకునే పరిస్థితులు నెలకొన్నాయని గ్యాస్ సిలిండరు వినియోగదారులు వాపోతున్నారు. గ్యాస్ ఏజెన్సీ డిస్ట్రిబ్యూటర్లు ప్రభుత్వ నియమావళికి అనుగుణంగా గ్యాస్ ఏజెన్సీ ప్రాంతం నుంచి ఐదు కి.మీ వరకు ఉచితంగా గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు డోర్ డెలివరీ చేయాల్సి ఉంది. 5 నుంచి 15 కి.మీ వరకు రూ.20, అంతకు ఎక్కువ ఉంటే రూ.30 గ్యాస్ సిలిండరు బిల్లు కన్నా అదనంగా చెల్లించాల్సి ఉంది. గ్యాస్ ఏజెన్సీ డిస్ట్రిబ్యూటరు నుంచి గ్యాస్ సిలిండర్ బిల్లుపైనే ఐదు కి.మీ లోపల గ్యాస్ సిలిండర్ డోర్ డెలివరీ చేయాలని నిబంధన ఉన్నా అటువంటివి ఏమీ పట్టనట్లు చేస్తుండడంపై వినియోగదారులు మండిపడుతున్నారు. కానీ ప్రభుత్వ నియమావళికి వ్యతిరేకంగా గ్యాస్ ఏజెన్సీ డిస్ట్రిబ్యూటరు, డెలివరీ బాయ్స్ వసూలు చేయడం అన్యాయం. ఇప్పటికైనా పౌర సంబంధాల శాఖ స్పందించి విచారణ చేపడితే తప్ప గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు గ్యాస్ డోర్ డెలివరీ బాయ్స్ నుంచి అదనపు ఛార్జీలు తప్పేట్లు లేవని బహిరంగంగానే తెలుపుతున్నారు.

# శరవేగంగా రోడ్ల విస్తరణ పనులు



కడప కార్పొరేషన్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:

కడప నగరంలో రోడ్ల విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని కడప నగరపాలక సంస్థ ఏసీపీ నాగేంద్ర పేర్కొన్నారు. బుధవారం కడప నగర పాలక సంస్థలో నాగేంద్ర మాట్లాడుతూ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్ ఆదేశాల మేరకు కడప నగరంలో పలు రోడ్ల విస్తరణ పనులు చేపట్టినట్లు చెప్పారు. మాసాపేట సర్కిల్ నుంచి దొరలగోరిల వరకు 80 అడుగులు, దొరల గోరీల నుంచి కేసీ కెనాల్ వరకు 90 అడుగులు మేర రోడ్ల విస్తరణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. అలాగే కృష్ణా సర్కిల్ నుంచి దేవుని కడప వరకు 80 అడుగులు, అంబేద్కర్ విగ్రహం నుంచి వై.జంక్షన్ వరకు 80 అడుగులు, గోకుల్ లాడ్జీ నుంచి అన్నమయ్య సర్కిల్ వరకు 70 అడుగుల వరకు విస్తరణ పనులు జరుగుతున్నాయని వివరించారు. అంగడివీధిలో కూడా 40, 60 అడుగుల మేరా రోడ్డును విస్తరిస్తున్నట్లు చెప్పారు. విస్తరణ పనులు జరిగిన ప్రదేశాల్లో రోడ్లకు ఇరువైపులలా రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నట్లు చెప్పారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

## - ఏపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రమేష్ కుమార్




మాట్లాడుతున్న ఏపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రమేష్ కుమార్, సమావేశానికి హాజరైన ప్రభుత్వ ఉద్యోగులు.

బద్వేలు అర్బన్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగుల సమస్యలు, ఆర్థిక పరమైన అంశాలు, ఉద్యోగుల జీతాలపై చట్టబద్ధత అనే అంశంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయం నందు బుధవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు యం.రమేష్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రామా నాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు ఆవుల శ్రీనివాసరావు, తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు హుస్సేనయ్య, పుష్పరాజు, పెన్షనర్స్ సంఘం అధ్యక్షులు డా॥ మీనాక్షిరెడ్డి లు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించవలసిన డిఏలు, 11వ పిఆర్‌సి బకాయిలు, 12వ పిఆర్‌సి కమీషన్‌తో పాటు ఆర్థిక అంశాలపైన చర్చించారు. ప్రభుత్వం మార్చి 30 లోపల ఉద్యోగులకు రావలసిన ఆర్థిక ప్రయోజనాలు చెల్లించని యెడల ఏప్రిల్ మొదటి వారం నుండి సమ్మెలోకి వెళ్ళవలసి వస్తుందని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వం జాప్యం చేస్తుందని, కావున ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు అందించే విధంగా చూడాలన్నారు. లేనిపక్షంలో ఏప్రిల్ మొదటి వారం నుండి సమ్మెబాట పట్టవలసి వస్తుందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సాంఘీక సంక్షేమ వసతిగృహం అధికారి, వైస్ ప్రెసిడెంట్ బి.లక్ష్మీదేవి, సెక్రెటరి ఎస్.ప్రసాద్, కార్యదర్శి బ్రహ్మయ్య, సిద్దవటం తాలూకా అధ్యక్షులు మురళీ కృష్ణ, జిల్లా యుటిఎఫ్ అధ్యక్షులు మాదన విజయకుమార్, విశ్రాంత ఉద్యోగి కొండయ్య, టీబి సూపర్‌వైజర్ ప్రసాద్, పార్వతీపురం హెచ్‌డబ్ల్యువో నాయక్, సరస్వతీపురం హెచ్‌డబ్ల్యువో యాకోబుతో పాటు పలువురు సంఘం నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# జగన్‌రెడ్డి అరాచక పాలనతో రాష్ట్రం అధోగతి పాలు

## -మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి



రాయచోటి, ఫిబ్రవరి15 ప్రభాతవార్త

జగన్‌రెడ్డి అరాచకపాలనతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అదోగతి పాలయిందని రాయచోటి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం రాయచోటి మున్సిపాలిటీలోని 16వ వార్డులో టిడిపి ఆద్వర్యంలో మన రాష్ట్రానికి ఇదేమి కర్మ, రచ్చబండ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కొనసాగుతున్న అరాచకపాలన ప్రజా, రైతు వ్యతిరేక విధానాలపై ప్రజలకు వివరించారు. అలాగే వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసి, మైనార్టీలకు రక్షణ లేకుండా పోయిందని, టిడిపి నేతలపై దాడులు, అక్రమ కేసులు ఎక్కువయ్యాయని, మహిళలపై అఘాయిత్యాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు అసంఘటిత కార్మికులు, విద్యుత్ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశాకార్యకర్తలు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు పనిభారంతో అల్లాడిపోతున్నారని చెప్పారు. అంతేకాక నాడు నేడు పనులు ఉపాధ్యాయులుకు, అంగన్‌వాడీ వర్కర్‌లకు తలకు మించిన భారంగా తయారయ్యాయని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా రోడ్లు గుంతలమయంగా తయారయ్యాయని, మున్సిపాలిటీలలో సిమెంట్ రోడ్లు అద్వాన్నంగా ఉన్నాయని, డ్రైనేజల శుభ్రత పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆయన విమర్శించారు. అస్తవ్యస్తంగా ఉన్న రాష్ట్ర వ్యవస్థ గాడిన పడాలంటే రాబోయే ఎన్నికలలో చంద్రబాబునాయుడును గెలిపించుకోవాలని, అందుకు ప్రజలంతా టిడిపిని ఆదరించి రాష్ట్రాన్ని రౌడీ మూకల అరాచకాల నుంచి కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బోనమల ఖాదర్‌వలి, మురికినాటి వెంకటసుబ్బారెడ్డి, వతన్ నిస్సార్, తదితరులు పాల్గొన్నారు.

# పట్టణం పరిశుభ్రతే లక్ష్యం

పీలేరు, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:



ఏపీఐఐసీ స్థలాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

పట్టణంను పరిశుభ్రంగా తీర్చి దిద్దడమే లక్ష్యం అని సర్పంచి డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. సీజనల్ వ్యాధులు వస్తున్నందున పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తూ పట్టణంలో ఎక్కడా చెత్తాచెదారం లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించడమే కాకుండా జగనన్న ఇంటి స్థలాలు ఏపీఐఐసీ లేఅవుట్ నందు చదునుచేసి అర్హులైన వారికి అందించడమే లక్ష్యంగా రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆశీస్సులతో ఎంపీ ఆదేశాలతో చింతల కషితో పట్టణ ప్రజల అభ్యర్థనలను గమనించి పట్టణ ప్రజలకు కావలసిన సౌకర్యాలను కల్పించేందుకు ముమ్మరంగా కషిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. పీలేరు పంచాయతీ రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా అన్ని రకాల ముందుకు నడిపించేందుకు కషిచేయడమే కాకుండా పట్టణంలో పరిశుభ్రమైన పార్కులను సైతం తయారుచేసేందుకు స్థలాన్ని కేటాయించడం జరిగిందని ఆయన తెలిపారు.

# యువగళం పాదయాత్రలో నారాలోకేష్ బాబుని కలిసిన మండిపల్లి



రాయచోటి టౌన్.ఫిబ్రవరి15 ప్రభాతవార్త

నారాలోకేష్‌బాబు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యువగళం పాదయాత్ర 20వ రోజు సత్యవేడు నియోజకవర్గం, పిచ్చాటూరులో కొనసాగున్న సందర్భంగా రాయచోటి టీడిపి నియోజకవర్గ నాయకుడు మండపల్లి రాంప్రసాద్‌రెడ్డి 10 వాహనాలలో 100 మందితో వెళ్లి జాతీయ ప్రధానకార్యదర్శి నారాలోకేష్ బాబును కలిసి సంఘీభావం తెలిపారు. అనంతరం రాయచోటిలో పలు సమస్యలు కార్యకర్తలు పడుతున్న ఇబ్బందులను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాలోకేష్‌బాబు చేస్తున్న పాదయాత్రకు అనూహ్యస్పందనను చూసి ఓర్వలేక ఈ ప్రభుత్వం ఆయనను అడుగడుగునా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా పాదయాత్రను అడ్డుకోలేరన్నారు. రాబోయే ఎన్నికలలో ఖచ్చితంగా టిడిపి అధికారంలోకి వస్తుందన్నారు. దీనికోసం టిడిపి నాయకులు, కార్యకర్తలు, కష్టపడి పనిచేసి టిడిపిని గెలిపించి తిరిగి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలని చెప్పారు.

# ప్రాజెక్టులు పూర్తి చేయడంలో ప్రభుత్వం విఫలం

## -కాలువలు పూర్తి చేసి రైతాంగానికి నీరందించాలి


## -సిపిఐ రాష్ట్ర పరిశీలన బృందం



గాలివీడు, ఫిబ్రవరి15 ప్రభాతవార్త:

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్ట్‌లను పూర్తిచేయడంలో ప్రస్తుత వైఎస్సార్‌సిపి ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని సిపిఐ రాష్ట్ర సహాయకార్యదర్శి ముప్పాల నాగేశ్వరారావ్ దుయ్యబట్టారు. బుధవారం రాష్ట్ర ప్రాజెక్ట్‌ల సందర్శనలో భాగంగా అఖిలపక్ష సభ్యులు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఓబులేషు, ఈశ్వరయ్యతో కలిసి అన్నమయ్య జిల్లా గాలివీడు మండలంలోని వెలిగల్లు జలాశయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా ఈ ప్రభుత్వం ప్రాజెక్ట్‌లను పూర్తి చేయడంలో వైఫల్యం చెందిందని తద్వారా రైతాంగానికి సాగునీరు లేక వ్యవసాయ భూములన్నీ ఎడారిగా మారాయని ఆరోపించారు. వెలిగల్లు ప్రాజెక్ట్ గత మూడు సంవత్సరాలుగా పూర్తి స్థాయిలో నిండుతున్నప్పటికి కాలువులకు నీటిని విడుదల చేసే పరిస్థితి లేదన్నారు. కుడి కాలువ క్రింద 24 వేల ఎకరాలు, ఎడమ కాలువ కింద 600 ఎకరాలు సాగు క్రింద చూపించారే గాని ఇంతవరకు ఒక ఎకరాకు కూడా నీరందని దాఖలాలు లేవని ఎద్దేవ చేశారు. స్థానిక ఎమ్మెల్యే ముఖ్యమంత్రికి ప్రధాన అనుచరుడుగా కొనసాగుతున్నప్పటికి ప్రాజెక్ట్ కాలువల పెండింగ్ పనులు పూర్తి చేయడంలో ఆసక్తిని కనబరచలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, రామాంజనేయులు, ఆవుల శేఖర్, సిపిఐ రాష్ట్ర రైతు సంఘం ఉపాద్యక్షులు కాటమయ్య, జనార్దన్, గాలిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడి కేంద్రంలో పోషణవేడుక



రాజుపాళెం, ఫిబ్రవరి15, ప్రభాతవార్త.

మండల పరిధిలోని తొండలదిన్నె గ్రామంలో బుధవారం అంగన్‌వాడి కేంద్రంలో సిబి ఈవెంట్స్‌లో భాగంగా పోషణవేడుక కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంనకు ముఖ్య అతిదిగా మాజరైన సిడిపిఓ రాజేశ్వరి మాట్లాడుతూ తల్లి బిడ్డలకు పోషణ విషయాలను వివరించారు. అదేవిధంగా బాలికల బాల్య వివాహాలపైన అవగాహన కల్పించారు. వైద్యాధికారులు మజులా, నిఖిలలు అరోగ్యం గురించి ప్రతి ఒక్కరు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కొండారెడ్డి, దేవసహాయం,104 డాక్టరు సుప్రజ, సూపర్‌వైజర్లు లక్ష్మీదేవి, విజయేశ్వరి, అంగన్‌వాడి కార్యకర్తలు సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

# అత్యంత వైభవంగా ఆరాధన మహోత్సవాలు

ప్రొద్దుటూరు క్రైం, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు మండల పరిధిలోని ఉప్పరపల్లె క్షేత్రంలో శ్రీసద్గురు సమర్థ నారాయణస్వామి వారి ఆరాధన మహోత్సవాలు అత్యంత వైభవంగా ముగిశాయి. బుధవారం ఆరాధనోత్సవం నిర్వహించడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా స్వామి వారిని విశేష అభిషేక అర్చన, పారాయణం, ఉపాసనలు జరిపి మహా మంగళహారతి నిర్వహించారు. విశేసంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. సాయంత్రం స్వామి వారి రథోత్సవంను శోభాయమానంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయడం జరిగిందని తెలిపారు.